తెలుగు దినపత్రిక
# సిరి
People's Voice వార్త పత్రిక
RNI TG TEL/ 26/A0381
21-05-2026
గురువారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 106
PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–

తెలుగు దినపత్రిక
www.siridaily.com
సిరి
People's Voice వార్తపత్రిక
RNI:TGTEL/26/A0381
siridailynews@gmail.com
/siridailynews
@siridailynews
epaper.siridaily.com
విలేకరులు కావలెను
ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.
99897 78881, 7702344303, 9440451575

## జనగణనలో కుల గణనకు సుప్రీం ఓకే

- వ్యతిరేకిస్తూ వచ్చిన పిటిషన్లు తిరస్కరణ



**న్యూఢిల్లీ, మే 20, సిరి న్యూస్ :**
కులగణనపై సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. జనగణనలో కులాల లెక్కింపునకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కూడిన ధర్మాసనం అనుమతి ఇచ్చింది. కులగణనను వ్యతిరేకిస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని చీఫ్ జస్టిస్ (సీజేఐ) సూర్యకాంత్, జస్టిస్ జయ మల్యా బాగ్చీ, విపుల్ పంచోలీలతో కూడిన ధర్మాసనం బుధవారం కొట్టివేసింది. సంక్షేమ పథకాల అమలుకు కులగణన తప్పనిసరి అని స్పష్టం చేసింది. కుల గణన ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని, ఈ అంశంలో కోర్టుల జోక్యం ఉండదని స్పష్టం చేసింది. వెనుకబడిన తరగతికి చెందిన వారు ఎంతమంది ఉన్నారో ప్రభుత్వం తెలుసుకోవాల్సి ఉందని ధర్మాసనం వ్యాఖ్యానించింది.



మూడవ డిస్కామ్
## ముళ్ల కిరీటం!

- అనుమతి ఇవ్వాలా వద్దా? ఈఆర్సీ మల్లగుల్లాలు
- ప్రారంభించాలన్న మొండిపట్టుతో ప్రభుత్వం..
- అక్కరలేని డిస్కామ్ ఎందుకని ఉద్యోగులు, మేధావుల ఆక్షేపణ
- పండగ ఆఫర్లలా 'ప్రమోషన్ల' ఎర.. కొత్త వ్యవస్థపై సర్వత్రా వెల్లువెత్తుతున్న నిరసనలు
- ముందే కోర్టులో కేవియెట్ దాఖలు చేసిన ప్రభుత్వం
- డిస్కామ్‌లను ప్రైవేట్ పరం చేసేందుకేనా నయా స్కెచ్

4

బండి సంజయ్‌కు బీజేపీ
## హైకమాండ్ అండ?



- భగీరథ్ వ్యవహారంపై బీఆర్ఎస్ దూకుడు
- రెండు రోజుల మౌనం తర్వాత బీజేపీ కౌంటర్ ఎటాక్
- సంజయ్‌ను టార్గెట్ చేస్తే ఊరుకోమన్న రామచంద్రరావు

4



## నా భౌతిక దేహంపై బీజేపీ జెండానే కప్పాలి!

- అదే నా చివరికి కోరిక
- కొత్త పార్టీ ప్రచారంపై భావోద్వేగానికి గురైన బండి
- కొడుకును స్వయంగా అప్పజెప్పిన తండ్రిని నేనని వివరణ
- బండి భగీరథ్ విషయంపై ధర్మాన్ని పాటిస్తా

4

# రాజకీయ ఉద్దండులకు సన్ స్ట్రోక్!

- కొడుకుల పాపం.. తండ్రులకు పదవీ గండం
- దశాబ్దాల శ్రమ.. పిల్లల తప్పిదంతో బూడిద
- బండి సంజయ్ కుమారుడిపై 'పోక్సో' కేసు..
- దేశవ్యాప్తంగా సంచలనంతో మళ్లీ తెరపైకి పాత జ్ఞాపకాలు
- పీసీసీ చీఫ్ పదవినే బలితీసుకున్న కేకే కొడుకు ఉదంతం
- సీఎం రేసు నుంచి కిందికి నెట్టేయబడ్డ డీఎస్ తనయుడు కేసు
- సంచలనంగా రాజయ్య కోడలు, ముగ్గురు మనవళ్ల సజీవ దహనం ఘటన
- రాఘవ ఆగడాలతో తండ్రికి కోలుకోలేని దెబ్బ
- కొడుకులు చేసిన నేరాలతో సీనియర్ నేతలు నవ్వులపాలు
- కన్న ప్రేమతో వెనుకేసుకొచ్చి మట్టికరిచిన మహామహులు



**ప్రత్యేక ప్రతినిధి, సిరి న్యూస్:**
రాజకీయాల్లో ఒక్కో ఇటుక పేర్చుకుంటూ, క్షేత్రస్థాయి నుంచి అంచెలంచెలుగా అత్యున్నత స్థాయికి ఎదగడం అంటే సామాన్యమైన విషయం కాదు. దశాబ్దాల కాలం పాటు ప్రజాక్షేత్రంలో ఎండనక, వాననక శ్రమించి, ఎన్నో ఒడిదుడుకులను తట్టుకుని నిలబడితేనే లీడర్లుగా గుర్తింపు వస్తుంది. సమాజంలో అపారమైన ఆదరణ, రాజకీయంగా అత్యున్నత హోదా, పరపతి సంపాదించుకున్న ఎంతోమంది మహామహులు.. ఒక్కసారిగా తగిలిన 'సన్' స్ట్రోక్‌తో తలపట్టుకుంటున్నారు. తాము కష్టపడి సంపాదించుకున్న పొలిటికల్ కెరీర్, ప్రతిష్ఠ అంతా కూడా

మిగతా 2వ పేజీలో..

## తెలంగాణలో ఠారెత్తిస్తున్న ఎండలు



- అలర్ట్ అయిన సీఎం రేవంత్..
- అధికారులకు కీలక ఆదేశాలు
- ఓఆర్ఎస్, తాగునీరు అందుబాటులో ఉంచాలని సూచన
- మధ్యాహ్నం ప్రయాణాలకు దూరంగా ఉండాలని ప్రజలకు హెచ్చరిక

2



## నేడే సరస్వతీ అంత్య పుష్కరాలు ప్రారంభం

- జూన్ 1వ తేదీ వరకు పుష్కరాలు
- 40 లక్షల భక్తుల హాజరయ్యే అవకాశం
- పుష్కరాలకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి
- రూ.1.20 కోట్లతో ప్రత్యేక మ్యూజియం ఏర్పాటు
- విజయవంతం చేయాలి : మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విజ్ఞప్తి

**భూపాలపల్లి, మే 20(సిరిన్యూస్):**
మండువేసవిలో చల్లని తల్లి సరస్వతి దేవి అంత్య పుష్కరాలు గురువారం నాడు అంగరంగ వైభవంగా ప్రారంభించడానికి ప్రభుత్వం సకల సౌకర్యాలు ఏర్పాట్లు పూర్తి చేసింది. ముందస్తుగా కంచి పీఠాధిపతి స్వామీ శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ తొలి పుష్కర స్నానం ఆచరించనున్నారు. మే 21 నుండి జూన్ 1వ తేదీ వరకు కాళేశ్వరంలో జరిగే సరస్వతీ అంత్య పుష్కరాలకు రాష్ట్ర ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది. పుష్కర

మిగతా 2వ పేజీలో..



బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులపై
## సింగరేణి ఆసక్తి

- కేంద్ర సహకారం అవరం
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డిని కోరిన డిప్యూటీ సీఎం భట్టి
- కొయ్యగూడెం బ్లాక్-III కేటాయింపు, తాడిచెర్ల బ్లాక్-II లీజ్‌పై చర్చ

2

హైదరాబాద్ మెట్రో రెండో దశకు
## కేంద్రం గ్రీన్ సిగ్నల్

- 50:50 వ్యయంతో ముందుకెళ్లేందుకు సిద్ధమన్న కేంద్రం
- 162 కిలోమీటర్ల విస్తరణ ప్రతిపాదనలపై సానుకూల సంకేతాలు
- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో సమావేశంలో స్పష్టత

2





## ఘోస్ట్ సిమ్‌లపై దేశ వ్యాప్తంగా పోలీసుల ఉక్కుపాదం

- "ఆపరేషన్ ఆక్టోపస్-3"లో 66 మంది అరెస్ట్
- 544 సిమ్ కార్డుల స్వాధీనం.. రూ.101 కోట్ల సైబర్ మోసాల గుర్తింపు

2

ఆసిఫాబాద్ గడ్డపై
## 'ఇందిరమ్మ' పండుగ

- 2న రెండో విడత ఇందిరమ్మ ఇండ్లకు సీఎం రేవంత్ శ్రీకారం
- అర్హులైన ప్రతితీ పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి పొంగులేటి

2





## కులగణనను స్వాగతిస్తున్నాం

- సుప్రీంకోర్టు తీర్పుపై మంత్రి పొన్నం హర్షం
- సామాజిక న్యాయానికి బలం చేకూరిందన్న మంత్రి

4

## బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రాజెక్టులపై సింగరేణి ఆసక్తి

**న్యూఢిల్లీ, మే 20, సిరి న్యూస్:**

బొగ్గును కేవలం సంప్రదాయ విద్యుత్ ఉత్పత్తికే పరిమితం చేయకుండా భవిష్యత్ పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా విలువ ఆధారితంగా వినియోగించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక, ఇంధన శాఖల మంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డితో న్యూఢిల్లీలో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సింగరేణి కంపెనీ భవిష్యత్ ప్రణాళికలు, బొగ్గు గ్యాసిఫికేషన్ అవకాశాలు, కొత్త బొగ్గు బ్లాకుల కేటాయింపు, తాడిచెర్ల కోల్ బ్లాక్ II మైనింగ్ లీజ్ అంశాలపై చర్చించారు. దేశవ్యాప్తంగా బొగ్గు గ్యాసిఫికేషన్‌కు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో సింగరేణి కూడా ఆ దిశగా ముందడుగు వేయడానికి సిద్ధంగా ఉందని కేంద్ర మంత్రికి భట్టి వివరించారు. కోల్ ఇండియా చేపడుతున్న గ్యాసిఫికేషన్ కార్యక్రమాల తరహాలోనే సింగరేణి కూడా తన బొగ్గు వనరులను ఆధునిక సాంకేతికతతో మరింత సమర్థవంతంగా వినియోగించే అవకాశాలను పరిశీలిస్తోందన్నారు. బొగ్గు గ్యాసిఫికేషన్ ద్వారా బొగ్గు వనరులకు అదనపు విలువ కల్పించడంతోపాటు, ఇంధన భద్రత, పారిశ్రామిక వినియోగాలు, ఉపాధి అవకాశాలు మరింత పెరుగుతాయని అన్నారు. ఇందుకు అవసరమైన సాంకేతిక మార్గదర్శకత్వం, విధానపరమైన సహకారం, కేంద్ర పథకాల అనుసంధానంలో బొగ్గు మంత్రిత్వ శాఖ సహకారం అందించాలని కోరారు. సింగరేణి దక్షిణ భారత దేశ బొగ్గు సరఫరా, విద్యుత్ రంగ అవసరాల తీర్చడంలో కీలక పాత్ర పోషిస్తున్న సంస్థ అని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని సింగరేణికి కొత్త బొగ్గు వనరుల సమీకరణ అత్యవసరమని తెలిపారు. గోదావరి వ్యాలీ కోల్ ఫీల్డ్స్ పరిధిలోని కొయ్యగూడెం బ్లాక్III తెలంగాణ విద్యుత్ అవసరాలకు కీలకమని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గతంలో ఈ బ్లాక్‌ను వేలంలో కేటాయించిప్పటికీ నాలుగేళ్లు గడిచినా కార్యకలాపాలు ప్రారంభం కాలేదని తెలిపారు. ఈ నేపథ్యంలో కొయ్యగూడెం బ్లాక్IIIను సింగరేణికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తాడిచెర్ల కోల్ బ్లాక్II అంశంపైనా సమావేశంలో చర్చ జరిగింది. ఈ బ్లాక్‌కు సంబంధించి సింగరేణి ఇప్పటికే ప్రీమైనింగ్ కార్యకలాపాలు, అన్వేషణ పనులు చేపట్టిందని, మైనింగ్ లీజ్ ప్రక్రియను వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని ఉప ముఖ్యమంత్రి అన్నారు. తాడిచెర్ల బ్లాక్II అభివృద్ధి సింగరేణి భవిష్యత్ అవసరాలకు, తెలంగాణ విద్యుత్ భద్రతకు కీలకమని చెప్పారు. తాడిచెర్ల కోల్ బ్లాక్‌కు ఎంఎండీఆర్ చట్టం,1957లోని సెక్షన్5 కింద ముందస్తు అనుమతి మంజూరు చేసి మైనింగ్ లీజ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కోరారు. ఈ అంశాలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించారు. సింగరేణి బొగ్గు గ్యాసిఫికేషన్ ప్రణాళికలు, కొయ్యగూడెం బ్లాక్III కేటాయింపు, తాడిచెర్ల బ్లాక్II మైనింగ్ లీజ్ అంశాలపై కేంద్ర, రాష్ట్ర అధికారులు, సింగరేణి ప్రతినిధులతో త్వరలో సంయుక్త సమావేశం ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్, సింగరేణి సీఎండీ డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్, డైరెక్టర్ పర్సనల్ అండ్ అడ్మినిస్ట్రేషన్ గౌతమ్ పొట్రు, డైరెక్టర్ ప్రాజెక్ట్స్ కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## హైదరాబాద్ మెట్రో రెండో దశకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

**న్యూఢిల్లీ, మే 20, సిరి న్యూస్**

హైదరాబాద్ మెట్రో రెండో దశ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయ అంగీకారం తెలిపింది. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డితో జరిగిన సమావేశంలో కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్లాల్ కట్టర్ కీలక వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సమర్పించిన డీపీఆర్‌ను పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు.

హైదరాబాద్ మెట్రో రెండో దశ ప్రాజెక్టుపై కేంద్రానికి ఎటువంటి అభ్యంతరం లేదని మనోహర్లాల్ కట్టర్ స్పష్టం చేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఎల్ అండ్ టీ సంస్థ నుంచి ప్రాజెక్టును టేకోవర్ చేసుకుందని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాన భాగస్వామ్యంతో 50:50 వ్యయ విధానంలో ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 162 కిలోమీటర్ల మేర మెట్రో విస్తరణ ప్రణాళికపై కేంద్రం సానుకూలంగా స్పందించినట్లు వెల్లడించారు. ప్రతిపాదనలపై సమగ్ర పరిశీలన అనంతరం తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

హైదరాబాద్ నగర అభివృద్ధి, పెరుగుతున్న రవాణా అవసరాలను దృష్టిలో ఉంచుకుని మెట్రో విస్తరణకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు కేంద్రం తెలిపింది. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని మనోహర్లాల్ కట్టర్ స్పష్టం చేశారు.

మెట్రో రెండో దశకు కేంద్రం సానుకూల సంకేతాలు ఇవ్వడంతో ప్రాజెక్టు వేగవంతం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. నగర పరిసర ప్రాంతాలకు మెట్రో సేవలు విస్తరించే అవకాశం ఉండటంతో ప్రయాణికుల్లో ఆశలు పెరిగాయి.

## తెలంగాణలో ఠారెత్తిస్తున్న ఎండలు


**హైదరాబాద్, మే 20, సిరి న్యూస్**

తెలంగాణలో పెరుగుతున్న ఎండల తీవ్రత, వడగాలుల నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి సూచించారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు అధికంగా నమోదయ్యే అవకాశం ఉండటంతో అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

జిల్లా కలెక్టర్లు పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సీఎం సూచించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లు తగిన స్థాయిలో అందుబాటులో ఉంచాలని, తాగునీరు, విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి జిల్లా ఆసుపత్రుల వరకు వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీఎం పేర్కొన్నారు. వడదెబ్బతో బాధపడుతూ ఆసుపత్రులకు వచ్చే వారికి తక్షణ వైద్య సేవలు అందించాలని సూచించారు.

పట్టణ ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. సాధ్యమైనంత వరకు ప్రజలు మధ్యాహ్న సమయంలో బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని హెచ్చరించారు.

రాష్ట్రంలోని పరిస్థితులను నిరంతరం పర్యవేక్షిస్తూ జిల్లా కలెక్టర్లకు అవసరమైన సూచనలు ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు.



# రాజకీయ ఉద్దండులకు సన్ స్ట్రోక్!

**మొదటిపేజీ తరువాయి**

తమ కన్న కొడుకుల నిర్వాకాల వల్ల రాత్రికి రాత్రే ప్రమాదంలో పడిపోతుండటంతో కన్నీరు మున్నీరవుతున్నారు. ఇటీవల కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, బీజేపీ ఫైర్ బ్రాండ్ నేత బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదు కావడం దేశవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది. ఈ ఘటన బండి సంజయ్ రాజకీయ భవిష్యత్తును సైతం శాసించేలా మారడంతో.. గతంలో కొడుకుల నిర్వాకాల వల్ల పొలిటికల్ గండం ఫేస్ చేసిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, ప్రస్తుత తెలంగాణ సీనియర్ నాయకుల 'సన్' స్ట్రోక్ స్టోరీలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారాయి.

**పీసీసీ చీఫ్ పదవినే బలితీసుకున్న కేకే కొడుకు ఉదంతం**

ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా ఉన్న డాక్టర్ కె. కేశవరావు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ రాజకీయాలను శాసించిన ముఖ్య నాయకుల్లో ఒకరు. ఆయన పీసీసీ అధ్యక్షుడిగా ఉండి చక్రం తిప్పుతున్న రోజుల్లో.. అంటే 2007 సెప్టెంబరు 9న కేకే కుమారుడు వెంకట్ నివాసంలో ఒక దారుణం జరిగింది. వెంకట్ వ్యాపార భాగస్వామి అయిన ప్రశాంత్, బుల్లెట్ గాయాలతో అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. అది ఆత్మహత్యేనని కేకే కుమారుడి తరపు వారు వాదించినా.. అది పక్కా హత్యేనంటూ ప్రశాంత్ కుటుంబ సభ్యులు ఆరోపించారు. ఈ ఘోరం అప్పట్లో తెలుగు రాష్ట్రాల్లో పెను సంచలనమైంది. విమర్శలు తీవ్రం కావడంతో.. నైతిక బాధ్యత వహిస్తూ కేశవరావు తన పీసీసీ చీఫ్ పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. కొడుకు చేసిన రగడ తండ్రి పదవినే బలితీసుకుంది.

**సీఎం రేసు నుంచి కిందికి నెట్టేయబడ్డ డీఎస్ 'తనయుడి' వివాదం**

ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్సార్ హయాంలో పీసీసీ అధ్యక్షుడిగా రెండుసార్లు పనిచేసి, కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చిన ధీరుడు ధర్మపురి శ్రీనివాస్ (డీఎస్). ఒకానొక దశలో ముఖ్యమంత్రి పదవికి కూడా గట్టిగా పోటీ పడిన డీఎస్ రాజకీయ జీవితం.. ఆయన కుమారుడు ధర్మపురి సంజయ్ వల్ల తీవ్ర ఒడిదుడుకులకు లోనైంది. 2018లో ధర్మపురి సంజయ్‌పైన లైంగిక వేధింపులతో పాటు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల తీవ్రతతో సంజయ్ అరెస్టయ్యారు కూడా. ఆ తర్వాత 2020లో సరైన సాక్ష్యాధారాలు లేకపోవడంతో న్యాయస్థానం ఈ కేసులను కొట్టివేసినప్పటికీ.. అప్పటికే డీఎస్ అనుభవించాల్సిన రాజకీయ నష్టం, అవమానం జరిగిపోయాయి.

**అభ్యర్థిత్వాన్ని బూడిద చేసిన కోడలి సజీవ దహనం**

రాష్ట్ర రాజకీయాల్లో అత్యంత విషాదకరమైన, సంచలనం సృష్టించిన కేసుల్లో మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య నివాసంలో జరిగిన ఘోరం ఒకటి. 2015లో రాజయ్య కోడలు సారిక, ఆమె ముగ్గురు కుమారులు ఇంట్లోనే అనుమానాస్పద స్థితిలో సజీవ దహనమయ్యారు. అప్పటికే తన భర్త అనిల్ కుమార్ వేధిస్తున్నాడంటూ సారిక పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో రాజయ్య కొడుకు అనిలే తన భార్యను, ముగ్గురు పిల్లలను హత్య చేశాడని సారిక కుటుంబ సభ్యులు రోదించారు. ఈ ఘోరకలి జరగడానికి కేవలం కొద్దిరోజుల ముందే వరంగల్ లోక్‌సభ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అధికారిక అభ్యర్థిగా రాజయ్య పేరు ఖరారైంది. కానీ కొడుకు చేసిన ఈ పాపం వల్ల అధిష్ఠానం రాజయ్య టికెట్‌ను రద్దు చేసి.. ఆ స్థానంలో సర్వే సత్యనారాయణను బరిలోకి దించాల్సి వచ్చింది.

**షకీల్ కెరీర్ కు కుమారుడి దబ్బ!**

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే మహమ్మద్ షకీల్ కూడా తీవ్రమైన 'సన్' స్ట్రోక్‌తో పొలిటికల్ మైలేజ్ కోల్పోయారు. ఆయన కుమారుడు రహీల్ అమీర్.. 2022లో జూబ్లీహిల్స్‌లో అమిత వేగంతో, నిర్లక్ష్యంగా కారు నడిపి ఒక మహిళను, ఆమె పసిబిడ్డను ఢీకొట్టాడు. ఈ ఘోర ప్రమాదంలో ఆ పసిపాప ప్రాణాలు కోల్పోయింది. ఆ తర్వాత కూడా బుద్ధి మార్చుకోకుండా అర్ధరాత్రి వేళ ప్రగతి భవన్ వద్ద బారికేడ్లను ఢీకొట్టి ప్రమాదానికి కారణమయ్యాడనే మరో కేసును కూడా రహీల్ ఎదుర్కొంటున్నాడు. ఈ రోడ్డు ప్రమాదాల రచ్చ షకీల్ ఇమేజ్‌ను పూర్తిగా డ్యామేజ్ చేసింది.

**వనమా ఇమేజ్ డ్యామేజ్ చేసిన రాఘవ ఆగడాలు**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పట్టున్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుకు తనయుడు వనమా రాఘవేంద్ర రూపంలో కోలుకోలేని 'సన్' స్ట్రోక్ తగిలింది. జనవరి 3, 2022న పాల్వంచకు చెందిన రామకృష్ణ అనే వ్యాపారి తన భార్య, ఇద్దరు కూతుర్లతో కలిసి ఆత్మహత్య చేసుకున్నాడు. తాము చనిపోవడానికి వనమా రాఘవేంద్ర పెట్టిన టార్చరే కారణమంటూ ఆ వ్యాపారి ఒక సెల్ఫీ వీడియో, సూసైడ్ నోట్ విడుదల చేయడం రాష్ట్రవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టించింది. రాఘవేంద్రను పోలీసులు అరెస్ట్ చేసి, పార్టీ నుంచి సస్పెండ్ చేసినప్పటికీ.. వనమా వెంకటేశ్వరరావు రాజకీయ పతనానికి ఆ ఒక్క కొడుకు చేసిన దందాలే కారణమయ్యాయి.

**ప్రజాప్రతినిధుల పిల్లల బాగోతం!**

మార్చి 28, 2022లో జూబ్లీహిల్స్ పెద్దమ్మగుడి సమీపంలో ఒక మైనర్ బాలికపై జరిగిన గ్యాంగ్ రేప్ ఉదంతం దేశాన్నే ఉలిక్కిపడేలా చేసింది. ఈ దారుణంలో ఆరుగురు బాలురపై పోక్సో కేసులు నమోదయ్యాయి. అయితే, ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిలో అప్పటి మజ్లిస్, బీఆర్ఎస్ పార్టీల కీలక ప్రజాప్రతినిధుల, ఉన్నతాధికారుల పిల్లలు ఉన్నారనే విషయం బయటకు రావడంతో పెద్ద ఎత్తున రాజకీయ దుమారం రేగింది. కొడుకులు చేసిన ఈ అఘాయిత్యం ఆయా లీడర్ల రాజకీయ జీవితాల్లో ఎప్పటికీ తుడిచేయలేని మాయని మచ్చగా మిగిలిపోయింది.

**మట్టి కరిచిన ఉద్దండులు**

రాజకీయాల్లో ఎంతోమంది ఉద్ధండులు రాష్ట్ర స్థాయిని, కేంద్ర స్థాయిని శాసించినప్పటికీ.. తమ కొడుకులు చేసిన అక్రమాలు, లైంగిక వేధింపులు, దందాలు మరియు క్రిమినల్ కేసుల వల్ల సమాజంలో తలదించుకోవాల్సి వస్తోంది. కన్న ప్రేమతో కొడుకుల తప్పులను కప్పిపుచ్చాలని చూసిన ప్రతి లీడర్.. చివరకు తమ పొలిటికల్ కెరీర్‌నే కోల్పోవాల్సి వచ్చింది. ఇప్పుడు బండి సంజయ్ వంతు వచ్చింది. తనయుడు భగీరథ్‌పై నమోదైన పోక్సో కేసు దేశవ్యాప్తంగా చర్చనీయాంశం కావడంతో.. రానున్న రోజుల్లో ఈ 'సన్' స్ట్రోక్ బండి సంజయ్ రాజకీయ ప్రస్థానాన్ని ఏ తీరానికి చేరుస్తుందో చూడాలి!

## ఆసిఫాబాద్ గడ్డపై 'ఇందిరమ్మ' పండుగ

**హైదరాబాద్/కొమరం భీమ్ ఆసిఫాబాద్, మే 20, సిరి న్యూస్ :**

రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవమైన జూన్ 2న పేదల సొంతింటి కలలను నిజం చేసే ప్రతిష్ఠాత్మక ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత కార్యక్రమానికి కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా వేదిక కానుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార, పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి బుధవారం జిల్లాలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. ఎక్సైజ్, పర్యాటక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు, శాసనమండలి సభ్యుడు దండే విఠల్, జిల్లా కలెక్టర్ కె.హరిత, బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ తదితరులతో కలిసి మంత్రి సభాస్థలి, రెబ్బెన మండలం కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్, కాగజ్‌నగర్ మండలం దాదానగర్, సిర్పూర్ పేపర్ మిల్ క్రీడా ప్రాంగణాన్ని పరిశీలించారు. ముఖ్యమంత్రి సందర్శించనున్న ప్రాంతాలతోపాటు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను కూడా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్రంలో అర్హత కలిగిన ప్రతీ పేదవాడికి ఇందిరమ్మ ఇల్లు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పేదవాడి ఆత్మగౌరవానికి ప్రతీకగా ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇండ్లు మంజూరు చేసినట్లు తెలిపారు. ఏప్రిల్ నాటికి రాష్ట్రవ్యాప్తంగా లక్షా 20 వేల ఇండ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని, జూన్ నాటికి 2.35 లక్షల ఇండ్లు పూర్తవుతాయని వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో గృహ నిర్మాణం ఆర్భాటాలకు మాత్రమే పరిమితమైందని, కానీ ప్రజా ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోపే నాగులు లక్షల ఇండ్ల నిర్మాణానికి రూ.22,700 కోట్లతో శ్రీకారం చుట్టిందని చెప్పారు. మొదటి, రెండో విడతలకే పరిమితం కాకుండా అర్హత గల ప్రతీ నిరుపేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసే వరకు ప్రభుత్వం కృషి కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆదివాసీ జిల్లా కొమరం భీమ్ ఆసిఫాబాద్‌లోని కొఠారి గ్రామంలో గిరిజన కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించడం ద్వారా ఆదివాసీల సొంతింటి కష్టాలను తొలగిస్తున్నామని మంత్రి తెలిపారు. మహిళలకు ప్రాధాన్యత ఇస్తూ, మహిళను కుటుంబానికి ఆధారస్తంభంగా గుర్తిస్తూ మహాలక్ష్మి, గృహజ్యోతి, రేషన్ కార్డులు, ఇందిరా మహిళా శక్తి, రాజీవ్ ఆరోగ్య శ్రీ వంటి పథకాల ద్వారా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. అనంతరం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా అర్హులైన పాత్రికేయులకు అక్రిడిటేషన్ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఘోస్ట్ సిమ్‌లపై దేశవ్యాప్తంగా పోలీసుల ఉక్కుపాదం

**హైదరాబాద్, మే 20, సిరి న్యూస్**

సైబర్ నేరాలకు ప్రధాన కేంద్రంగా మారుతున్న ఘోస్ట్ సిమ్ వ్యవస్థపై హైదరాబాద్ నగర పోలీసులు భారీ స్థాయిలో చర్యలు చేపట్టారు. "ఆపరేషన్ ఆక్టోపస్3" పేరుతో దేశవ్యాప్తంగా విస్తృత దాడులు నిర్వహించి కీలక ముఠాలను అదుపులోకి తీసుకున్నారు. సైబర్ నేరాల మూలాలను అరికట్టడమే లక్ష్యంగా ఈ ప్రత్యేక ఆపరేషన్ చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటికే మ్యూల్ ఖాతాదారులు, అక్రమాలకు సహకరించిన బ్యాంకు అధికారులపై చర్యలు తీసుకున్న పోలీసులు ఇప్పుడు ఘోస్ట్ సిమ్ వ్యవస్థపై ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా 18 ప్రత్యేక బృందాలు దేశంలోని 13 రాష్ట్రాల్లో ఏకకాలంలో దాడులు నిర్వహించాయి.

ఈ దాడుల్లో మొత్తం 66 మందిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. వారి వద్ద నుంచి 544 సిమ్ కార్డులను స్వాధీనం చేసుకున్నారు. విచారణలో భాగంగా ఈ సిమ్‌ల ద్వారా దేశవ్యాప్తంగా రూ.101.87 కోట్ల విలువైన 76 సైబర్ నేరాలు జరిగినట్లు గుర్తించారు. అరెస్టైన వారిలో ప్రముఖ టెలికాం సంస్థలకు చెందిన 20 మంది విక్రయ కేంద్ర ప్రతినిధులు కూడా ఉన్నట్లు అధికారులు తెలిపారు. వినియోగదారుల బయోమెట్రిక్ వివరాలను అక్రమంగా సేకరించి నిబంధనలకు విరుద్ధంగా సిమ్‌లు జారీ చేసినట్లు తేలిందని పేర్కొన్నారు. "సర్వర్ పనిచేయడం లేదు" అంటూ అదనపు బయోమెట్రిక్ వివరాలు తీసుకోవడం, గ్రామీణ ప్రాంతాల్లో ఉచిత అంతర్జాలం పేరుతో నిరక్షరాస్యుల ఆధార్ వివరాలు సేకరించడం వంటి మోసపూరిత పద్ధతులను ముఠాలు అనుసరిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

ఇలా సేకరించిన సిమ్‌లను వెంటనే ఈసిమ్‌లుగా మార్చి విదేశాల్లో ఉన్న సైబర్ ముఠాలకు చేరవేస్తున్నట్లు విచారణలో బయటపడింది. ఆ సిమ్‌లతో సామాజిక మాధ్యమ ఖాతాలు తెరిచి డిజిటల్ అరెస్ట్, బ్లాక్‌మెయిల్, ఆర్థిక మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ప్రజలు తమ ఆధార్, బయోమెట్రిక్ వివరాలను ఎవరితోనూ పంచుకోవద్దని పోలీసులు హెచ్చరించారు. తమ పేరుపై ఎన్ని సిమ్‌లు ఉన్నాయో అధికారిక సంచార్ సాథి పోర్టల్‌లో పరిశీలించాలని సూచించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే జాతీయ సైబర్ ఫిర్యాదు పోర్టల్ లేదా 1930 సహాయ సంఖ్యను సంప్రదించాలని తెలిపారు.

# నేడే సరస్వతీ అంత్య పుష్కరాలు ప్రారంభం

**మొదటిపేజీ తరువాయి**

స్నానాలు మే 21 వ తేదీ నుండి 12 రోజుల పాటు జూన్ 1 వరకు 12 రోజులు జరగనున్నాయి. ఈ పుష్కరాలకు 30 నుండి 40 లక్షల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉన్నదని ప్రభుత్వం భావిస్తోంది.ఈ మేరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు అన్ని ఏర్పాట్లను పూర్తి చేశారు. గత సంవత్సరం జరిగిన సరస్వతీ ఆది పుష్కరాల అనుభవాలను దృష్టిలో పెట్టుకుని ఈ అంత్య పుష్కరాలకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా అధికార యంత్రాంగం పకడ్బందీ చర్యలను చేపట్టింది. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని పుష్కర ఘాట్ వద్ద క్వయర్ మ్యాట్లు, చలువ పందిళ్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున పుష్కర ఘాట్ పరిసరాల్లోని 23 ప్రాంతాల్లో వాహనాల పార్కింగ్, బీ.టి రోడ్ల నిర్మాణాన్ని చేపట్టారు. పుష్కరాల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం 30.63 కోట్ల నిధులను కేటాయించింది. పుష్కరాల తొలిరోజైన 21 వ తేదీ తెల్లవారు జామున 5.43 గంటలకు కంచి పీఠాధిపతి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి వారు పుష్కర స్నానం చేసి అంత్య పుష్కరాలను లాంఛనంగా ప్రారంభిస్తారు. ప్రారంభం నుండి జూన్ 1వ తేదీ వరకు ప్రతీ రోజూ ఒక ప్రముఖ పీఠం స్వామిజీ ఈ పుష్కరాల్లో పాల్గొని పుణ్య స్నానం చేస్తారు. ప్రతీరోజూ ఉదయం హోమాలు నిర్వహణ, సాయంత్రం పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. పుష్కర స్నానాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం 90 షటిల్ బస్సులను ఏర్పాటు చేశారు. రెస్క్యూ బృందాలతోపాటు ప్రత్యేక శిక్షణ పొందిన 100 మంది గజ ఈతగాళ్లను సరస్వతీ ఘాట్, నదీ ప్రాంతంలో నియమించారు.



దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో రూ.1.20 కోట్లలతో ప్రత్యేకంగా మ్యూజియాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడి నాగేంద్ర స్వామి ఆలయాన్ని 30 లక్షలతో పునర్నిర్మాణం చేశారు. పుష్కరాల సందర్భంగా ప్రతిరోజూ నిర్వహించే హారతి, హోమాలు, తెప్పోత్సవం లకు పెద్ద ఎత్తున ఏర్పాట్లను చేపట్టారు. పుష్కరాలకు హాజరయ్యే వారి సౌకర్యార్థం పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలను కల్పించారు. దాదాపు 500 మరుగుదొడ్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేయడంతో పాటు తాగునీటి కోసం రెండు ఓ.హెచ్.ఆర్.సి లను నిర్మించారు. వాహనాల కోసం ఏర్పాటు చేసిన 23 పార్కింగ్ కేంద్రాలలోనూ తాగునీటి సౌకర్యంతో పాటు మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు.

**మెడికల్ క్యాంపులు ఏర్పాటు..**

కాళేశ్వరం పుష్కర ఘాట్ లోని 23 జోన్లలో ప్రత్యేక మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశారు. ఇందుకుగాను వైద్యులు, వైద్యాధికారులు, పారా మెడికల సిబ్బందిని 300 మందిని ప్రత్యేకంగా నియమించారు. అన్ని ప్రధాన ప్రాంతాల్లో అంబులెన్సులు అందుబాటులో ఉంచనున్నారు. మహాదేవ పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రెఫరల్ ఆసుపత్రిగా ఏర్పాటు చేశారు.

**వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు...**

సరస్వతీ అంత్య పుష్కారాలకు లక్షా 70 వేల వాహనాలు వస్తాయని అధికారులు అంచనా వేసారు. వీటికి గాను 245 ఎకరాల్లో పార్కింగ్ ఏర్పాట్లు చేశారు. పార్కింగ్ ఏరియాలతో పాటు ఘాట్స్, దేవాలయం తదితర ప్రాంతాలలో 200 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పుష్కర స్నానాలకు వెళ్లే మార్గంలో ప్రత్యేకంగా ఎల్.ఈ.డీ లైట్లను ఏర్పాటు చేశారు. ఈ 12 రోజులపాటు పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణకుగాను 300 మంది పారిశుద్ధ్య సిబ్బందిని నియమించారు. పుష్కర ఘాట్లలో నిరంతరం విద్యుత్ సరఫరా జరిగే విధంగా చర్యలు చేపట్టారు.

**100 మంది గజ ఈతగాళ్ల నియామకం..**

పుష్కర స్నానాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా 100 మంది గజ ఈతగాళ్లను నియమించారు. వీటితోపాటు సేఫ్టీ బోట్స్, లైఫ్ రింగ్స్, ఎస్.డి.ఆర్.ఎఫ్ టీంలను నియమించారు. పుష్కర కార్యక్రమాలను ఎప్పటికప్పుడు ప్రజలకు అందించేందుకు ఈఓ కార్యాలయంలో మీడియా సెంటర్ చేశారు.

**పుష్కరాలను విజయవంతం చేయండి...**

**– రాష్ట్ర మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు**

సంస్కృతి సాంప్రదాయాలకు పెద్దపీట వేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని నిర్వహిస్తున్న సరస్వతి దేవి అంత్యపుష్కరాలలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర ఐటి,పరిశ్రమలు, ఎలక్ట్రానిక్స్, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ప్రజలకు, భక్తులకు విజ్ఞప్తి చేశారు. స్వల్ప కాలవ్యవధిలోనే ప్రభుత్వ ఆదేశాల మేరకు అధికారులు భక్తులకు కావలసిన అన్ని రకాల సౌకర్యాలను పెద్ద ఎత్తున చేపట్టారని పేర్కొన్నారు. భక్తులు పూర్తి సౌకర్యవంతంగా పుణ్య స్నానాలు ఆచరించి ఓపికగా దైవ దర్శనం చేసుకొని పునీతులు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## సంపాదకీయం



# "రెండు ఖండాల కలయిక... సరికొత్త ప్రగతి వేదిక!"

భారతదేశం, ఇటలీ మధ్య దౌత్య సంబంధాలు కేవలం స్నేహపూర్వక బంధం నుండి అత్యంత శక్తిమంతమైన 'ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం'గా రూపాంతరం చెందడం అంతర్జాతీయ రాజకీయాల్లో ఒక మైలురాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రస్తుత ఇటలీ పర్యటనలో భాగంగా ఆ దేశ ప్రధానమంత్రి జార్జియా మెలోనితో జరిపిన ద్వైపాక్షిక చర్చలు ఇరు దేశాల బంధాన్ని ఒక 'నిర్ణయాత్మక దశకు' చేర్చాయి. ప్రజాస్వామ్య విలువలు, స్వేచ్ఛ, భవిష్యత్తుపై ఉమ్మడి దృక్పథమే పునాదిగా ఇరు దేశాలు వేగంగా అడుగులు వేస్తున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇరు దేశాల ఆర్థిక సంబంధాలు గణనీయమైన వృద్ధిని సాధిస్తున్నాయి. 2025 నాటికి భారత్-ఇటలీ మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 16.77 బిలియన్ డాలర్లకు చేరుకుంది. ప్రస్తుతం అమలులో ఉన్న 'జాయింట్ స్ట్రాటజిక్ యాక్షన్ ప్లాన్ 2025-2029' ద్వారా 2029 నాటికి ఈ వాణిజ్యాన్ని 20 బిలియన్ యూరోలకు పెంచాలని ఇరు దేశాల అధినేతలు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇటలీకి చెందిన అత్యాధునిక డిజైన్, పారిశ్రామిక నైపుణ్యం, సాంకేతికత.. భారతదేశపు 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమంతో చేతులు కలపడం ద్వారా సరఫరా వ్యవస్థలు మరింత బలోపేతం అవుతున్నాయి.ప్రస్తుత భౌగోళిక రాజకీయాల్లో హిందూ మహాసముద్రాన్ని, మధ్యధరా ప్రాంతాన్ని కలిపే ఇండో-మెడిటరేనియన్ కారిడార్ ఒక నూతన ఆర్థిక శక్తిగా అవతరిస్తోంది. ఈ వ్యూహంలో అత్యంత కీలకమైనది ఇండియా-మిడిల్ ఈస్ట్-యూరప్ ఎకనామిక్ కారిడార్. ఆసియాను యూరప్‌తో అనుసంధానించే ఈ భారీ ప్రాజెక్టును వేగవంతం చేయడంలో ఇటలీ వ్యవస్థాపక సభ్యురాలిగా చురుకైన పాత్ర పోషిస్తోంది. మరోవైపు రక్షణ రంగంలో కూడా ఇరు దేశాలు 2026-27 సంవత్సరాలకు గానూ ద్వైపాక్షిక సైనిక సహకార ప్రణాళికను మార్పిడి చేసుకున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), స్పేస్ టెక్నాలజీ, సైబర్ భద్రత, సముద్ర తీర రక్షణ వంటి రంగాలలో ఉమ్మడి పరిశోధనలకు ఇరు దేశాలు అంగీకరించాయి. అయితే, పాకిస్తాన్‌కు సున్నితమైన రక్షణ సాంకేతికతలను బదిలీ చేయవద్దని ఇటలీకి భారత్ గట్టిగా స్పష్టం చేయడం ఈ వ్యూహాత్మక చర్చల్లో ప్రాధాన్యత సంతరించుకుంది.భారతీయ సంస్కృతి ప్రబోధించే 'వసుధైవ కుటుంబం' (ప్రపంచమంతా ఒకే కుటుంబం) సూత్రం, ఇటలీకి చెందిన మానవతావాద పునరుజ్జీవన సంప్రదాయాలు పరస్పరం సరిపోలుతున్నాయి. ఐరోపా సమాఖ్యతో భారత్ జరుపుతున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందానికి ఇటలీ పూర్తి మద్దతు ఇస్తోంది. మారుతున్న అంతర్జాతీయ సమీకరణాల్లో చైనా 'బెల్ట్ అండ్ రోడ్' ప్రాజెక్ట్ నుండి ఇటలీ తప్పుకున్న తరుణంలో భారత్‌తో కుదుర్చుకుంటున్న ఈ దార్శనిక బంధం రెండు ఖండాల భవిష్యత్తును సానుకూల ఆర్థిక, రక్షణ ప్రగతి వైపు నడిపిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

# ఐ ఫౌండేషన్ ప్రతిభ ఆధ్వర్యంలో విద్యార్థుల ప్రతిభకు గుర్తింపు

- 560కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు హైదరాబాద్‌లో ఘన సన్మానం

**గుమ్మడిదల, మే 20 (సిరి న్యూస్):**




పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహిస్తూ ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గుమ్మడిదల మండల పరిధిలో 560కు పైగా మార్కులు సాధించిన విద్యార్థులకు బుధవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి ఆడిటోరియంలో సన్మాన కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని పుట్నాల తేజస్విని 565 మార్కులు సాధించి ప్రతిభ చాటగా, బొంతపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన హేమలతదాస్ 563 మార్కులతో ఉత్తీర్ణత సాధించి ప్రశంసలు అందుకున్నారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించిన ఐ ఫౌండేషన్ సంస్థ వారికి ప్రతిభ పురస్కారాలు అందజేసి ఘనంగా సత్కరించింది. అదేవిధంగా విద్యార్థులను ఉత్తమ ఫలితాల దిశగా తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను కూడా ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు. గుమ్మడిదల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుబ్బలక్ష్మి, బొంతపల్లి పాఠశాల గణిత శాస్త్ర ఉపాధ్యాయులు ప్రసాద్‌లను విద్యార్థులకు దిశానిర్దేశం చేసి మంచి ఫలితాలు సాధించేందుకు కృషి చేసినందుకు సన్మానించారు. ఈ సందర్భంగా గుమ్మడిదల పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుబ్బలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే ప్రభుత్వ పాఠశాలల నుంచే అద్భుత ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల విద్యార్థుల్లో అపారమైన ప్రతిభ దాగి ఉందని, తల్లిదండ్రుల సహకారం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం ఉంటే వారు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని పేర్కొన్నారు.విద్యార్థుల విజయాలు ఇతరులకు ఆదర్శంగా నిలుస్తాయని, ఇలాంటి పురస్కారాలు మరింత ఉత్సాహాన్ని కలిగిస్తాయని అన్నారు.

# గృహ గణన ప్రక్రియను సందర్శన ఆర్ డి ఓ

**తూప్రాన్ మే 20 సిరి న్యూస్**



తూప్రాన్ మండలం నాగులపల్లి గ్రామంలో జరుగుతున్న జనగణన కార్యక్రమాన్ని బుధవారం సందర్శించిన ఆర్ డి ఓ జయ చంద్రారెడ్డి గ్రామంలో జరుగుతున్న గృహ గణన ప్రక్రియను పరిశీలించి, ఎన్యూమరేటర్లు నమోదు చేస్తున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆర్‌డీఓ మాట్లాడుతూ, ఈ నెల 11వ తేదీ నుండి ప్రారంభమైన జనగణన కార్యక్రమం తూప్రాన్ డివిజన్ వ్యాప్తంగా కొనసాగుతున్నదని తెలిపారు. ఇప్పటివరకు డివిజన్‌లో మొత్తం 52,689 ఇళ్లకు గాను 19,064 ఇళ్ల ఎన్యూమరేషన్ పూర్తి చేయబడిందని, సుమారు 36 శాతం పూర్తి అయిందని ఇంకా, జూన్ 9వ తేదీ నాటికి జనగణన ప్రక్రియను పూర్తి స్థాయిలో ముగించే లక్ష్యంతో అధికారులు పనిచేస్తున్నారని తెలిపారు. ఈ జనగణనలో భాగంగా ప్రతి ఇంటికి సంబంధించిన వివరాలు, ఇంటి స్థితి, గదుల సంఖ్య, వాహనాల వివరాలు తదితర సమాచారం ఎన్యూమరేటర్లు నమోదు చేస్తున్నారని చెప్పారు కొంతమంది ప్రజలు వాహనాల వివరాలు ఇస్తే రేషన్ కార్డులు తొలగిస్తారనే అపోహతో సమాచారం ఇవ్వడానికి వెనుకంజ వేస్తున్నారని, అలాంటి భయాలు అవసరం లేదని, ఎవరి రేషన్ కార్డులు కూడా తొలగించబడవని, ఈ సమాచారం కేవలం ప్రభుత్వ గణాంకాల కోసం మాత్రమే సేకరించబడుతోందని స్పష్టం చేశారు. ప్రజలు జనగణన కార్యక్రమానికి సహకరించి సరైన వివరాలు అందించాలని ఆర్.డి.ఓ జయ చంద్రా రెడ్డి తెలిపారు ఈ కార్యక్రమంలో తూప్రాన్ తాసిల్దార్ చంద్రశేఖర్ రెడ్డి రెవిన్యూ ఇన్స్ స్పెక్టర్ ప్రేమ్ కుమార్ రెవిన్యూ సిబ్బంది ప్రజలు పాల్గొన్నారు

# అనుమానాస్పద వ్యక్తులకు లాడ్జ్ గదులు ఇవ్వొద్దు

- గుర్తింపు పత్రాలు తప్పనిసరి..
- జగిత్యాల టౌన్ సీఐ కరుణాకర్

**జగిత్యాల టౌన్, మే 20, సిరి న్యూస్ :**



జగిత్యాల పట్టణంలో శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని లాడ్జ్ యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నిర్వాహకులు తప్పనిసరిగా పాటించవలసిన భద్రత నిబంధనలు, మార్గదర్శకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ లాడ్జ్‌లలో గదులు కేటాయించే ముందు ప్రతి ఒక్కరి నుండి ఆధార్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ ఐడీ లేదా ఇతర చెల్లుబాటు అయ్యే గుర్తింపు పత్రాలు తప్పనిసరిగా సేకరించాలని సూచించారు. వారి పూర్తి వివరాలను రిజిస్టర్‌లో నమోదు చేసి భద్రపరచాలని, అవసరమైన సందర్భాల్లో పోలీసులకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అదేవిధంగా లాడ్జ్ ప్రాంగణం మొత్తం సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రవేశ ద్వారాలు, రిసెప్షన్, పార్కింగ్ ప్రదేశాలు, కారిడార్లలో నాణ్యమైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, అవి 24 గంటల పాటు నిరంతరం పనిచేసేలా నిర్వహించాలని తెలిపారు. సీసీ ఫుటేజ్ కనీసం కొంతకాలం భద్రపరిచే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులకు లేదా సరైన గుర్తింపు పత్రాలు లేని వారికి గదులు కేటాయించరాదని స్పష్టం చేశారు. ఇలాంటి నిర్లక్ష్యం వలన నేరాలకు అవకాశం ఏర్పడే ప్రమాదం ఉన్నందున లాడ్జ్ యజమానులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఏవైనా అనుమానాస్పద కదలికలు గమనించిన వెంటనే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. పోలీసు శాఖ జారీ చేసిన మార్గదర్శకాలను ఉల్లంఘించిన లాడ్జ్ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని స్పష్టం చేశారు. పట్టణ భద్రతలో లాడ్జ్ నిర్వాహకుల సహకారం అత్యంత కీలకమని, ప్రజల రక్షణ కోసం పోలీసు శాఖతో సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

# కళ్ళు పోతున్నాయి నరకంగా మారిన రాత్రి ప్రయాణం

- ప్రమాదాలకు ప్రధాన కారణం ఎల్ఈడీ లైట్లు
- సగం లైట్ స్టిక్కర్ నిబంధన జాడలేదు
- ఆర్టీవో అధికారుల పర్యవేక్షణ కరువు

**సంగారెడ్డి ప్రతినిధి, మే 20, సిరి న్యూస్:**

రాత్రి 7 గంటల తర్వాత వాహనాలు నడపాలంటే భయమేస్తుంది. ఎదురొచ్చే వాహనాల ఎల్ఈడి హై వోల్టేజ్ లైట్స్ వల్ల కళ్ళు కనిపించకుండా పోతున్నాయి కొత్తగా వచ్చే వాహనాలు కొత్తగా ఎల్ఈడి లైట్స్ తో ఐవోల్టేజ్తో వస్తున్నాయి. ఆర్టీవో అధికారుల పర్యవేక్షణ కరువు నియంత్రణ జాడ ఎక్కడ లేదు. గతంలో వాహనాల హెడ్లైట్ కు సగం వరకు బ్లాక్ స్టిక్కర్ ఉండాలి అన్నా నిబంధన ఉండేది. అసలు ఆ రోలు ఉందో తీసేసారు కూడా తెలియట్లేదు. ఎల్ఈడి లైట్ల వల్ల ఎదురుగా వచ్చే వాహనాలు కనబడక కళ్ళు మసకబారి ఏమి కనబడకుండా పోయి ప్రమాదాలు జరిగే అవకాశాలు మెండుగా ఉన్నాయి, కనుక సంబంధిత అధికారులు వాహనాల హెడ్ లైట్స్ లకు వస్తున్న లైట్స్ గురించి చర్యలు తీసుకుని కనీసం హెడ్లైట్లకు సగం వరకు బ్లాక్ స్టిక్కర్ కానీ బ్లాక్ పెయింట్ కానీ వేయాలని రూల్ను పునరుద్ధరించాలి అని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# సిద్దిపేటలో నిలిచిపోయిన బీసీ స్టడీ సర్కిల్ పనులను వెంటనే పూర్తి చేయాలి

**బీఆర్ఎస్ నేతల డిమాండ్**

**చిన్నకోడూరు, మే 20, సిరి న్యూస్:**



సిద్దిపేట జిల్లా కేంద్రంలో గత ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి హరీష్ రావు ప్రత్యేక చొరవతో మంజూరైన బీసీ స్టడీ సర్కిల్ భవన నిర్మాణ పనులు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంతో నిలిచిపోయాయని బీఆర్ఎస్ నాయకులు ఆరోపించారు. బీసీ స్టడీ సర్కిల్ భవన నిర్మాణ పనులను బీఆర్ఎస్ నాయకులు, బీఆర్ఎస్వీ, యువజన విభాగం నాయకులు, నిరుద్యోగ యువతతో కలిసి బుధవారం పరిశీలించిన అనంతరం మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ పాల సాయిరాం మీడియాతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో స్థలం, నిధులు కేటాయించి భవన నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకున్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనులు పూర్తిగా నిలిచిపోయాయని అన్నారు. ఇప్పటికే భవన నిర్మాణం 75 శాతం వరకు పూర్తయినా, గత రెండేళ్లుగా ఒక్క అడుగు కూడా ముందుకు సాగలేదని విమర్శించారు. బీసీ స్టడీ సర్కిల్ పూర్తయితే సిద్దిపేట జిల్లాకు చెందిన నిరుద్యోగ యువత, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉండేదని తెలిపారు. అయితే ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా యువత అవకాశాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని మాజీ మంత్రి హరీష్ రావు చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలకు కాంగ్రెస్ నాయకులు కనీసం మరమ్మతులు చేయలేని పరిస్థితిలో ఉన్నారని పాల సాయిరాం విమర్శించారు. బీసీ స్టడీ సర్కిల్ వద్ద నుంచే కాంగ్రెస్ నాయకులకు సవాల్ విసురుతూ "ప్రభుత్వ నిధులతో అయినా, సొంత నిధులతో అయినా హరీష్ రావు నిర్మించిన భవనాలకు సున్నాలు వేయగలిగితే చూపించాలి" అని అన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న బీసీ స్టడీ సర్కిల్ భవన నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేసి విద్యార్థులు, నిరుద్యోగులకు అందుబాటులోకి తీసుకురావాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు.

# ఘనంగా పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం

**వర్గల్, మే 20, సిరి న్యూస్:**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం వర్గల్ మండలం నెంటూరు (రాంసాగర్ పల్లి) గ్రామంలో శ్రీ పెద్దమ్మ తల్లి ఆలయ 4వ వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా బుధవారం పెద్దమ్మతల్లి కళ్యాణ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు మహా అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఈ కళ్యాణ మహోత్సవ వేడుకకు ప్రజలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం సభ్యులు, కమిటీ సభ్యులు మాట్లాడుతూ పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించినందుకు పార్టీల నాయకులకు ధన్యవాదాలని, పెద్దమ్మతల్లి అనుగ్రహంతో అందరూ బాగుండాలని, వార్షికోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహిస్తున్న నిర్వాహకులను అభినందించి అమ్మ దయతో సకాలంలో వర్షాలు కురిసి పాడిపంటలతో రైతులు సుభిక్షంగా ఉండాలని, అందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకోవడం జరిగిందని అన్నారు. ముదిరాజ్ నాయకులు ఐక్యతతో అధికంగా రాజకీయంగా ఎదగాలని ఆకాంక్షించారు. ముదిరాజ్ సంఘం అధ్యక్షులు శేఖర్, ఆలయ కమిటీ ఉపాధ్యక్షులు ఆంజనేయులు, ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షులు పాండు, ఆలయ కమిటీ సభ్యులు, ముదిరాజ్ సంఘం సభ్యులు, ముదిరాజ్ కుల బంధువులు, గ్రామస్తులు, యువకులు, మహిళలు, చిన్నారులు, భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# భట్రాజు సంఘ ప్రతినిధులను సన్మానించిన బీసీ సమాజ్ స్టేట్ సెక్రటరీ బట్టు విజయరాజు

**కుత్బుల్లాపూర్ ప్రతినిధి, మే 20, సిరి న్యూస్ :**

హైదరాబాద్ లోని తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియం లో బి. సి. టైమ్స్ & బి. సి. సమాజ్ సూర్యా రావు & భట్టు విజయరాజు ల ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా గెలిచిన భట్రాజు సామాజిక వర్గానికి చెందిన మునిసిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, సర్పంచులు మరియు వార్డు సభ్యులకు ఏర్పాటు చేసిన ఆత్మీయ అభినందన సత్కార సభ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రం నుండి భట్రాజు కులస్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ డి. జి. పి. పూర్ణచందర్ రావ్ , రాష్ట్ర భట్రాజు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దేవరాజు విష్ణువర్ధన్ రాజు, ప్రతికంఠం పూర్ణచందర్ రాజు, భట్రాజు ఫెడరేషన్ చైర్మన్ చక్రహరి బాల్ రాజు , రాష్ట్ర మహిళా నాయకులు హేమలత, సావిత్రి, గీత, రాష్ట్ర మరియు జిల్లా నాయకులు సరికొండ నరస రాజు, సరికొండ రామరాజు, కూరపాటి కరుణాకర్ రాజు, లోలబట్టు కృష్ణంరాజు, రేవతినంద్, కృష్ణార్జున రాజు, రాఘవ రాజు, పోతుమంచి ప్రకాష్ రాజు, తోకచిచ్చు పుల్లం రాజు, కూరపాటి నర్సింహా రాజు, సరస్వతి రామరాజు, గోవర్ధన్ రాజు, బోల్లేపల్లి జగన్మోహన్ రాజు, బిరుదరాజు రాజేందర్ రాజు, ఆకుపాముల రామ రాజు, కార్పొరేటర్ కూరపాటి సుధాకర్ రాజు, ఆనంద్ రాజు, కూరపాటి రంగరాజు, బోల్లేపల్లి సీతారామ్ రాజు, అంబటి సురేందర్ రాజు, విద్యాధరుని వేణుగోపాల్ రాజు మరియు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మునిసిపల్ కౌన్సిలర్లు, కార్పొరేటర్లు, సర్పంచులు, వార్డు సభ్యులుగా గెలుపొందిన వారు మరియు భట్రాజు కులస్తులు పాల్గొన్నారు.

## నా భౌతిక దేహంపై బీజేపీ జెండానే కప్పాలి!

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

బీజేపీ పై ప్రేమ ఉన్న వ్యక్తిని.. చివరి శ్వాస విడిచాక భౌతిక దేహంపై బీజేపీ జెండా కప్పాలనే చివరి కోరిక ఉన్న ఎంతో మంది అభిమానుల్లో నేను ఒకడిని. అంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ భావోద్వేగంతో తెలిపారు.బండి భగీరథ్ పై ఆరోపణలు వచ్చిన తర్వాత మొట్టమొదటిసారిగా బీజేపీ రాష్ట్ర కార్యాలయానికి వచ్చిన సందర్భంగా అయన మాట్లాడుతూ తనపై రకరకాల ఊహాగానాలు రావడం పై అయన అభ్యన్తరం వ్యక్తం చేసారు. నేను కొత్త పార్టీ పెడుతున్నా అని ఒకరు రాస్తారు. నేను బీజేపీ లోనుండి బీజేపీ ద్వారానే ఈ స్థాయికి వచ్చా అలాంటపుడు నాపై ఇలా ఆరోపణలు చేయడం తగదన్నారు. కొత్త పార్టీ అనే చిల్లర మల్లర రాజకీయాలు చేసే ఆలోచనలు ఉండవు.. నేను ఎప్పటికి బీజేపీ కార్యకర్తనే అని అయన వివరణ ఇచ్చారు. కొడుకును స్వయంగా పోలీసుల కు అప్పగించిన ఏకైక నాయకుడిని నేను. కేసీఆర్ కొడుకులా ఫేక్ మీడియాలు నడిపి దుష్ప్రచారం చేసేవాళ్ళం కాదు...వాళ్ళ గడి గోడలు బద్దలు కొట్టాం.. ఫ్రస్టేషన్ తో ఏదో ఏదో చేస్తుంటారు.. అవన్నీ పట్టించు కోం.. నన్ను అరెస్ట్ చేస్తారనే విషయంపై మాట్లాడను.. కోర్టు లో అన్ని తేలుతాయి.. కాగా, సంజయ్ కు సంఘీభావంగా భారీ సంఖ్యలో బీజేపీ శ్రేణులు కార్యాలయానికి చేరుకుని.. న్యాయం గెలుస్తుంది.. సంజయ్ మా నాయకుడు అంటూ పెద్ద పెట్టిన నినాదాలతో హోరెత్తించారు.

## కులగణనను స్వాగతిస్తున్నాం

**హైదరాబాద్, మే 20, సిరి న్యూస్**

కులగణనపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ స్వాగతించారు. జనగణనలో కులాల లెక్కింపునకు అనుమతి ఇవ్వడం సామాజిక న్యాయం దిశగా కీలక అడుగని పేర్కొన్నారు. కులగణనను వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడం హర్షణీయమన్నారు.

తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే కులగణన చేపట్టి సామాజిక న్యాయం అమలులో ముందంజలో ఉందని మంత్రి తెలిపారు. బలహీన వర్గాలకు సరైన ప్రాధాన్యం, అవకాశాలు కల్పించాలంటే ఖచ్చితమైన గణాంకాలు అవసరమని అభిప్రాయపడ్డారు. దేశవ్యాప్తంగా కూడా తెలంగాణ తరహాలో కులగణన నిర్వహించాలని మంత్రి డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీ కూడా గతంలో ఇదే అంశాన్ని దేశవ్యాప్తంగా ప్రస్తావించారని గుర్తు చేశారు.

కులగణన ద్వారా వెనుకబడిన వర్గాల అసలు పరిస్థితులు వెలుగులోకి వస్తాయని, అప్పుడు మాత్రమే సముచిత రిజర్వేషన్లు, సంక్షేమ పథకాలు సమర్థంగా అమలు చేయగలమని పేర్కొన్నారు.

వెనుకబడిన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని, ప్రస్తుతం అది రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని ఆమోద ప్రక్రియను వేగవంతం చేయాలని మంత్రి డిమాండ్ చేశారు.

## సస్పెండ్ అయినా తగ్గని లగ్జరీ..

- **సబ్ రిజిస్ట్రార్ ఇంట్లో తనిఖీల్లో బయటపడ్డ కోట్లు..!**
- **హన్మకొండలో ఏసీబీ సర్ప్రైజ్ దాడులు**
- **ఇళ్లు, ప్లాట్లు, నగదుతో భారీ ఆస్తుల గుర్తింపు**
- **ఇంట్లో లగ్జరీ కారు, బంగారం, వెండి స్వాధీనం**
- **రూ.30 కోట్ల అక్రమాస్తులపై కేసు నమోదు**

**హన్మకొండ, మే,20, సిరి న్యూస్:**

: అక్రమార్జనతో కోట్లు కూడబెట్టిన మరో ప్రభుత్వ అధికారి అవినీతి నిరోధక శాఖ (ACB) వలలో చిక్కారు. హన్మకొండ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్II గా పనిచేస్తూ, ప్రస్తుతం సస్పెన్షన్‌లో ఉన్న దేవులూరి ఆనంద్ ఇళ్లపై ఏసీబీ అధికారులు బుధవారం సర్ప్రైజ్ చెక్స్ నిర్వహించారు. ఆదాయానికి మించిన ఆస్తులు కూడబెట్టారనే పక్కా సమాచారంతో ఆనంద్ నివాసంతో పాటు ఆయన బంధువులు, స్నేహితుల ఇళ్లలో ఏకకాలంలో సోదాలు చేపట్టారు. ఈ దాడుల్లో సదరు అధికారికి ఏకంగా రూ. 30 కోట్ల రూపాయల విలువైన ఆస్తులు ఉన్నట్లు అధికారులు గుర్తించడం సంచలనంగా మారింది.



ఈ ఏసీబీ సోదాల్లో భారీగా స్థిరాస్తులు, నగదు, బంగారు ఆభరణాలు బయటపడ్డాయి. డాక్యుమెంట్ల ప్రకారం సుమారు రూ. 71,56,708 విలువైన రెండు లగ్జరీ నివాస గృహాలు, అలాగే రూ. 28,37,000 విలువైన ఆరు ఓపెన్ ప్లాట్లకు సంబంధించిన పత్రాలను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అయితే వీటి ప్రస్తుత ఓపెన్ మార్కెట్ విలువ అధికారిక ప్రభుత్వ అంచనాల కంటే చాలా రెట్లు ఎక్కువగా ఉండే అవకాశం ఉందని ఏసీబీ పేర్కొంది. స్థిరాస్తులతో పాటు ఇళ్లలో దాచిన రూ. 24,50,450 లిక్విడ్ క్యాష్, రూ. 7,05,367 బ్యాంక్ బ్యాలెన్స్, అలాగే రూ. 6,07,700 విలువైన హోమ్ అప్లయన్సెస్ (గృహోపకరణాలు) కనుగొన్నారు. వీటితో పాటు రూ. 13,25,000 విలువ చేసే ఒక లగ్జరీ కారు, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఇక అన్నింటికంటే ముఖ్యంగా సదరు సస్పెండెడ్ అధికారి ఇంట్లో ఏకంగా 819.5 గ్రాముల బంగారం, 2264.5 గ్రాముల వెండి వస్తువులు లభించాయి. వీటి మొత్తం విలువ సుమారు రూ. 43,16,930 గా అధికారులు లెక్కగట్టారు. ప్రస్తుతం ఈ అక్రమాస్తుల వ్యవహారంపై ఏసీబీ కేసు నమోదు చేసి, దర్యాప్తును మరింత వేగవంతం చేసింది.

## నేను ఎలాంటి వాడినో కార్యకర్తలకు తెలుసు

- **కొడుకును స్వయంగా పోలీసులకు అప్పగించానన్న బండి సంజయ్**
- **కేసీఆర్ కుటుంబ పాలనను అంతం చేసింది బీజేపీయేనని వ్యాఖ్య**

**హైదరాబాద్, మే 20, సిరి న్యూస్**

పోక్సో కేసులో తన కుమారుడిని స్వయంగా పోలీసులకు అప్పగించానని కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ తెలిపారు. విచారణకు పూర్తిస్థాయిలో సహకరించాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. తాను ఎలాంటి వాడినో బీజేపీ కార్యకర్తలకు బాగా తెలుసని అన్నారు.

హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడిన బండి సంజయ్.. కన్న కొడుకును స్వయంగా పోలీసులకు అప్పగించిన సందర్భం మరెక్కడైనా ఉందా అని ప్రశ్నించారు. చట్టంపై విశ్వాసంతోనే విచారణకు సహకరిస్తున్నామని పేర్కొన్నారు.బీజేపీ కార్యకర్తలు క్రమశిక్షణతో పనిచేసే వారని, పార్టీ కోసం అంకితభావంతో పని చేస్తారని అన్నారు. ఒక బీజేపీ కార్యకర్తను చివరి కోరిక ఏమిటని అడిగితే చనిపోయిన తర్వాత పార్టీ జెండా కప్పాలని కోరుకుంటాడని వ్యాఖ్యానించారు తనను కేంద్ర మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని ఇతర పార్టీల నాయకులు చేస్తున్న డిమాండ్లపై కూడా బండి సంజయ్ స్పందించారు. కేసీఆర్ పార్టీకి ప్రస్తుతం లోక్‌సభలో ఒక్క ఎంపీ కూడా లేరని విమర్శించారు. ఫామ్ హౌస్‌లో కూర్చుని తమపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ అవినీతి సామ్రాజ్యాన్ని కూకటివేళ్లతో పెకలించింది బీజేపీయేనని బండి సంజయ్ పేర్కొన్నారు. కుటుంబ పాలనకు ముగింపు పలికినందుకే తమపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు.

# మూడవ డిస్కామ్ ముళ్లకిరీటం!

**తెలంగాణ బ్యూరో, సిరి న్యూస్:**

తెలంగాణ విద్యుత్ శాఖలో ప్రతిపాదిత మూడవ డిస్కామ్ (రైతు డిస్కామ్) ఏర్పాటు వ్యవహారం ఇప్పుడు తీవ్ర సంచలనంగా మారింది. ఎన్నో అభ్యంతరాలు, నిరసనల మధ్య పురుడు పోసుకోబోతున్న ఈ కొత్త డిస్కామ్‌కు అనుమతి ఇవ్వాలా వద్దా అనే విషయమై తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి తీవ్ర మల్లగుల్లాలు పడుతోంది. ఇప్పటికే ఉన్న రెండు డిస్కామ్‌ల నుంచే ఆస్తులను, అప్పులను, ఉద్యోగులను పంచి.. కేవలం ఉచిత పథకాల నిర్వహణ కోసమే ఈ సరికొత్త 'రైతు డిస్కామ్'ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం మొండిపట్టుతో ముందుకు సాగుతోంది. అయితే, ఈ నిర్ణయం ఉన్న వ్యవస్థను బాగుచేయకపోగా, మరింత నష్టాల ఊబిలోకి నెట్టేసే ప్రమాదం ఉందంటూ విద్యుత్ రంగానికి చెందిన ఉద్యోగ, సామాజిక, మేధావి వర్గాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అసలు ఈ కొత్త డిస్కామ్ వల్ల ఒనగూరే ప్రయోజనం ఏంటో, దీని వెనుక ఉన్న హేతుబద్ధత ఏంటో తెలియకుండానే కేవలం పాలకవర్గాన్ని ఏర్పాటు చేసి, పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం తొందరపడుతుండటం ఇప్పుడు ఎన్నో సందేహాలకు తావిస్తోంది.

**పండగ ఆఫర్లలా ప్రమోషన్ల ఎర..**

సాధారణంగా పండగ సీజన్లలో వ్యాపార సంస్థలు 'ఒకటి కొంటే ఒకటి ఉచితం' అంటూ కస్టమర్లను ఆకర్షించడానికి బంపర్ ఆఫర్లు ప్రకటిస్తుంటాయి. కానీ, ఆశ్చర్యకరంగా ఇక్కడ తెలంగాణ విద్యుత్ శాఖలో కొత్తగా ఏర్పాటు చేయనున్న రైతు డిస్కామ్‌లో చేరితే 'ప్రమోషన్ ఆఫర్' ఇస్తామంటూ ప్రభుత్వం కొత్త ఎర వేయడంపై సర్వత్రా నిరసన వ్యక్తమవుతోంది. కొత్త డిస్కామ్ ఏర్పాటు ప్రకటన వెలువడిన మొదట్లో ఉద్యోగుల్లో భవిష్య నిధి, పెన్షన్, జీత భత్యాలపై ఎన్నో అనుమానాలు తలెత్తాయి. దీనిపై ఉద్యోగ సంఘాలతో యాజమాన్యం జరిపిన చర్చల్లో సంఘాలు లేవనెత్తిన ప్రాథమిక ప్రశ్నలకు యాజమాన్యం సరైన సమాధానాలు ఇవ్వలేకపోయింది. దీంతో ఈ సమస్య నుంచి గట్టెక్కేందుకు, ఉద్యోగులను లోబర్చుకునేందుకు "కొత్త డిస్కామ్‌లో చేరితే తక్షణ ప్రమోషన్" అనే నిబంధనను ఉత్తర్వుల్లో చేర్చింది. ప్రస్తుత డిస్కామ్‌లలో దాదాపు 15 ఏళ్ల వరకు కొత్తగా ప్రమోషన్ వచ్చే అవకాశం లేకపోవడంతో, ప్రమోషన్ల కోసం ఈపీఎఫ్ ఉద్యోగులు భారీ ఎత్తున దరఖాస్తులు చేసుకున్నారు. అయితే, ఇది తాత్కాలిక ప్రయోజనమే తప్ప భవిష్యత్తులో ఈ విభజన వల్ల పెద్ద ఎత్తున చిక్కులు రావడం ఖాయమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**కోర్టుకు వెళ్లకుండా కేవియెట్..**

రైతు డిస్కామ్ ఏర్పాటుపై లోపల ఎంత వ్యతిరేకత ఉన్నా, దీనిని ఎలాగైనా ప్రారంభించాలనే పట్టుదలతో ఉన్న ప్రభుత్వం.. అటువైపు నుంచి ఎలాంటి న్యాయపరమైన చిక్కులు ఎదురుకాకుండా ముందే ముందస్తు జాగ్రత్తలు తీసుకుంది. కొత్త డిస్కామ్‌లోకి ఉద్యోగుల విభజన ప్రక్రియపై ఉద్యోగ సంఘాలు ఎక్కడ కోర్టును ఆశ్రయించి స్టే తెస్తాయో అన్న భయంతో ప్రభుత్వం ముందే కోర్టులో 'కేవియెట్' దాఖలు చేసింది. ఇలా ఎన్నో ఆంక్షలు, నిర్బంధాలు, చట్టపరమైన రక్షణల మధ్య ఈ మూడవ డిస్కామ్‌ను బలవంతంగా పురిడు పోయించేందుకు సన్నాహాలు చేస్తుండటం ప్రభుత్వంలోని అభద్రతా భావానికి నిదర్శనమని విమర్శలు వస్తున్నాయి.

**ఉద్యోగుల పంపిణీ సరే.. మరి కొత్త ఉద్యోగాలేవీ?**

రెండు డిస్కామ్‌లను ముక్కలు చేసి ఏర్పాటు చేస్తున్న ఈ కొత్త రైతు డిస్కామ్ పరిధిలోకి దాదాపు 30 లక్షల వ్యవసాయ కనెక్షన్లు, ఐదున్నర లక్షల ట్రాన్స్‌ఫార్మర్ల నిర్వహణ బాధ్యత రానుంది. ఇంత భారీ నెట్‌వర్క్‌ను మెయింటెన్ చేయడం కోసం కేవలం వెయ్యి మంది కార్మికులను మాత్రమే బదిలీ చేస్తుండటం హాస్యాస్పదంగా మారింది. వేలాది సర్వీసులకు ఒక్కరే ఉద్యోగి చొప్పున పనిచేస్తే రైతులకు నాణ్యమైన సేవలు ఎలా అందుతాయన్నది ఇప్పుడు పెద్ద ప్రశ్నగా మారింది. దీనికి తోడు కొత్త డిస్కామ్‌కు కావాల్సిన ట్రాన్స్‌ఫార్మర్ రిపేరింగ్ సెంటర్లు (SPM), కస్టమర్ కేర్ సెంటర్లు, జిల్లా స్టోర్స్ వంటి మౌలిక వసతుల కల్పన ఎలా సాధ్యమనే దానికి యాజమాన్యం వద్ద ఎలాంటి సమాధానం లేదు. కొత్త డిస్కామ్ అంటున్నారే తప్ప, అందులోకి కొత్త ఉద్యోగాల నియామకాలు చేపట్టకపోవడం నిరుద్యోగులను, కేడర్‌ను మోసం చేయడమేనన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**రైతు డిస్కామ్ ముసుగులో ప్రైవేటీకరణ స్కెచ్?**

కొత్త డిస్కామ్ ఏర్పాటు వెనుక ఉన్న అసలు వ్యూహం ఉన్న డిస్కామ్‌ల ప్రైవేటీకరణేనన్న అనుమానాలు ఇప్పుడు బలంగా మారుతున్నాయి. ఈ ఆరోపణల్లో నిజం లేకపోలేదు. ఎందుకంటే, ఉన్న డిస్కామ్‌ల నుండి నష్టాల్లో నడిచే వ్యవసాయ రంగాన్ని, ఉచిత పథకాలను వేరు చేసి 'రైతు డిస్కామ్' పరిధిలోకి నెట్టేస్తే.. ఇక మిగిలిన రెండు డిస్కామ్‌లు పూర్తిగా కమర్షియల్, ఇండస్ట్రియల్, గృహ విద్యుత్ వినియోగదారుల ద్వారా లాభాల్లో నడిచే వ్యాపార సంస్థలుగా మిగులుతాయి. అలాంటప్పుడు లాభాల్లో ఉన్న ఆ రెండు డిస్కామ్‌లను కార్పొరేట్ సంస్థలకు, ప్రైవేట్ పరంచేయడం ప్రభుత్వానికి అత్యంత సులువవుతుంది. ప్రైవేటీకరణ కోసమే ప్రభుత్వం ఈ తరహా వ్యూహంతో అడుగులు వేస్తోందని ఉద్యోగ సంఘాలు బహిరంగంగానే ఆరోపిస్తున్నాయి.

ఈఆర్సీకి పోటెత్తిన అభ్యంతరాలు.. ఈ మూడవ డిస్కామ్ ఏర్పాటుపై ప్రజలు, మేధావులు, ఉద్యోగుల అభిప్రాయాలు, అభ్యంతరాలను స్వీకరించేందుకు తెలంగాణ విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ ఈ నెల 18 వరకు గడువు ఇచ్చింది. ఈ గడువులోగా వివిధ ప్రజా సంఘాలు, మేధావుల నుంచి ఏకంగా 32 రకాల ప్రధాన అభ్యంతరాలు ఈఆర్సీకి అందాయి. దాదాపు 90 శాతానికి పైగా వచ్చిన అభిప్రాయాలన్నీ ఈ కొత్త డిస్కామ్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ వచ్చినవే కావడం గమనార్హం. ప్రభుత్వం మాత్రం కొత్త డిస్కామ్‌కు అనుమతి ఇవ్వాలని, విభజనకు సంబంధించిన ఆస్తులు, అప్పుల అంకెల గారడీని పొందుపరుస్తూ ఈఆర్సీకి దరఖాస్తు చేసుకుంది. అలాగే కొత్త డిస్కామ్‌లో చేరేందుకు ఖాళీల కంటే రెట్టింపు సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయని ఈఆర్సీ మెప్పు పొందేందుకు ప్రయత్నిస్తోంది కానీ.. అంతర్గతంగా ఉద్యోగులు, రైతులు లేవనెత్తిన అసలు సమస్యలను ఎక్కడా ప్రస్తావించలేదు. ఇంతటి తీవ్ర వ్యతిరేకత, క్షేత్రస్థాయి లోపాల మధ్య ఈఆర్సీ ఈ ముళ్లకిరీటం లాంటి మూడవ డిస్కామ్‌కు అనుమతి ఇస్తుందా? లేదా అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని బ్రేక్ వేస్తుందా? అనేది ఇప్పుడు ఉత్కంఠ రేపుతోంది.

## తెలంగాణకు రూ.5 వేల కోట్లు ఇవ్వండి

- **కేంద్ర మంత్రికి భట్టి వినతి**

**న్యూఢిల్లీ, మే 20, సిరి న్యూస్:**

తెలంగాణ అభివృద్ధి, విద్యా రంగ విస్తరణకు కేంద్ర ప్రభుత్వం అదనపు ఆర్థిక సహాయం అందించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. న్యూఢిల్లీలో జరిగిన సమావేశంలో రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలు, మౌలిక వసతులు, విద్యా రంగ పెట్టుబడులపై కీలక చర్చలు జరిపారు.

ప్రత్యేక సహాయ పథకం కింద తెలంగాణకు అదనంగా రూ.5 వేల కోట్ల ప్రత్యేక ఆర్థిక సహాయం మంజూరు చేయాలని భట్టి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాల అమలుకు మరింత ఆర్థిక మద్దతు అవసరమని కేంద్ర మంత్రికి వివరించారు.

గత కొన్నేళ్లలో ప్రత్యేక ప్రయోజన సంస్థల ద్వారా తీసుకున్న అప్పుల భారం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతోందని భట్టి తెలిపారు. అయినప్పటికీ విద్య, వైద్యం, గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. యంగ్ ఇండియా సమగ్ర నివాస పాఠశాలల ద్వారా విద్యార్థులకు ప్రపంచ స్థాయి విద్య అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. జిల్లాల వారీగా కొత్త వైద్య కళాశాలలు, గ్రామీణ ఆరోగ్య సేవల విస్తరణ, విద్యా మౌలిక వసతుల బలోపేతంపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు వెల్లడించారు.

విద్యా రంగ రూపాంతరానికి రూ.30 వేల కోట్ల పెట్టుబడి ప్రణాళిక రూపొందించినట్లు భట్టి తెలిపారు. ఇందులో 105 సమగ్ర నివాస పాఠశాలల నిర్మాణంతో పాటు ప్రభుత్వ కళాశాలలు, సాంకేతిక విద్యాసంస్థల అభివృద్ధి కూడా భాగమని పేర్కొన్నారు.

ఈ ప్రాజెక్టులకు సంబంధించిన రుణాలను రాష్ట్ర ఆర్థిక పరిమితుల నుంచి మినహాయించాలని కేంద్రాన్ని కోరారు. భవిష్యత్ తరాల విద్యా సాధికారత కోసం దీర్ఘకాలిక పెట్టుబడులు పెడుతున్నామని తెలిపారు. వికసిత భారత్ లక్ష్య సాధనలో తెలంగాణ విద్యా, మౌలిక వసతుల అభివృద్ధి కీలక పాత్ర పోషిస్తుందని భట్టి పేర్కొన్నారు.


## గ్లోబల్ టెక్ ట్రావెల్ క్లస్టర్‌గా హైదరాబాద్

- **సౌత్ వెస్ట్ ఎయిర్‌లైన్స్ ఇన్నోవేషన్ సెంటర్ ప్రారంభోత్సవంలో మంత్రి శ్రీధర్‌బాబు**

**హైదరాబాద్, మే 20, సిరి న్యూస్ :**




గ్లోబల్ టెక్ ట్రావెల్ క్లస్టర్‌గా హైదరాబాద్‌ను తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తున్నామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. భవిష్యత్తు సవాళ్లను ఎదుర్కొనేలా ఈ రంగంలో దిగ్గజ కంపెనీలను ఆకర్షించేలా ఒక పటిష్ఠమైన ఎకో సిస్టంను అభివృద్ధి చేస్తున్నామన్నారు. హైటెక్ సిటీలో అమెరికాకు చెందిన ప్రముఖ ఎయిర్ లైన్స్ సంస్థ సౌత్ వెస్ట్ ఎయిర్ లైన్స్ గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్‌ను ఆయన బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ విమానయానం, స్పేస్‌టెక్, డిఫెన్స్, డీప్‌టెక్ తదితర రంగాల్లో హైదరాబాద్ ఒక వ్యూహాత్మక కేంద్రంగా ఎదుగుతోందని వివరించారు. గత రెండేళ్ల వ్యవధిలో వ్యాన్‌గార్డ్, మారియట్ ఇంటర్నేషనల్, హెచ్‌సీఏ హెల్త్ కేర్, హార్ట్‌ఫోర్డ్, బీఏఎస్ఎఫ్ తదితర ఎన్నో దిగ్గజ సంస్థలు హైదరాబాద్‌ను తమ గమ్యస్థానంగా ఎంచుకున్నాయన్నారు. తాజాగా ఈ జాబితాలో సౌత్ వెస్ట్ ఎయిర్స్ లైన్స్ కూడా చేరడం మనకు గర్వకారణమన్నారు. హైదరాబాద్ ఇన్నోవేషన్ ఎకో సిస్టంను మరింత బలోపేతం చేసేలా నేటి పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా 'రెడీ టు వర్క్‌ఫోర్స్' తయారీపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. ఆర్ అండ్ డీ, స్కిల్లింగ్, ఇన్నోవేషన్ తదితర అంశాల్లో దిగ్గజ సంస్థలతో కలిసి పనిచేసేందుకు ప్రత్యేక కాంప్రహెన్సివ్ రోడ్డు మ్యాప్‌ను సిద్ధం చేస్తున్నామన్నారు. తాజాగా ప్రారంభమైన ఈ గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్ 'సౌత్ వెస్ట్ ఎయిర్ లైన్స్'కు ఒక స్ట్రాటజిక్ హబ్ గా పనిచేయనుంది. కంపెనీ గ్లోబల్ నెట్ వర్క్, సపోర్టింగ్ టెక్నాలజీ, ఇంజినీరింగ్, ఎంటర్ ప్రైజ్ కేపబిలిటీస్ తదితర అంశాల్లో కీలక సేవలు అందించనుంది. డీప్ టెక్, ఏఐ/ఎంఎల్, డేటా సైన్స్, డేటా అనలిటిక్స్, డిజిటల్ ఇంజినీరింగ్, సైబర్ సెక్యూరిటీ, ఎంటర్‌ప్రైజ్ ప్లాట్‌ఫామ్స్ తదితర విభాగాల్లో నిపుణులైన వేయిమందికి ఉపాధి లభించనుంది.



## వరంగల్ జంట హత్యల కేసు..

- **నిందితుడికి మరణశిక్ష**

**వరంగల్, మే20, సిరి న్యూస్:**

వరంగల్ జిల్లాలో చోటుచేసుకున్న ఒక పాశవిక జంట హత్యల కేసులో జిల్లా మొదటి అదనపు న్యాయమూర్తి జె. మైత్రేయి నిందితుడికి మరణశిక్ష విధిస్తూ చారిత్రాత్మక తీర్పు వెలువరించారు. 2024 జూలై 10 అర్ధరాత్రి వేళ, చెన్నారావుపేట మండలం చింతల తండాలో జంట హత్యల ఘటన చోటుచేసుకుంది. గుండెంగ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మేకల నాగరాజు (బన్నీ), తండాకు చెందిన దీపికను ప్రేమ వివాహం చేసుకున్నాడు. అయితే నాగరాజు ప్రవర్తన నచ్చక దీపిక పుట్టింటికి వచ్చేయడంతో, తన భార్యను దూరం చేశారనే పగతో నాగరాజు కక్ష పెంచుకున్నాడు.

అర్ధరాత్రి వేళ కత్తితో దీపిక కుటుంబంపై విచక్షణా రహితంగా దాడి చేయగా.. ఆమె తల్లి సుగుణ అక్కడికక్కడే, తండ్రి శ్రీను ఆసుపత్రి మార్గమధ్యంలో మృతి చెందారు. తీవ్ర గాయాలైన దీపిక, ఆమె సోదరుడు మదన్ ప్రాణాలతో బయటపడ్డారు. నెక్కొండ సీఐ శ్రీనివాస్ పక్కా సాక్ష్యాధారాలతో చార్జిషీట్ దాఖలు చేయగా, బాధితుల తరపున స్పెషల్ పీపీ బృందాదేవి వాదించారు. నిందితుడి చర్య అత్యంత పాశవికమైనదని, సమాజంలో ఇలాంటి నేరగాళ్లకు జీవించే హక్కు లేదని స్పష్టం చేస్తూ.. నిందితుడు నాగరాజుకు మరణించే వరకు ఉరిశిక్ష అమలు చేయాలని న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

# బండి సంజయ్‌కు బీజేపీ హైకమాండ్ అండ?

**హైదరాబాద్, మే 20, సిరి న్యూస్**

కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడు భగీరథ్‌కు సంబంధించిన వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ అంశాన్ని ప్రధాన అస్త్రంగా చేసుకున్న బీఆర్ఎస్, బండి సంజయ్‌ను కేంద్ర మంత్రివర్గం నుంచి తప్పించాలని డిమాండ్ చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు కూడా చేపడుతోంది.

అయితే ఈ వ్యవహారంలో తొలి రెండు రోజుల పాటు తెలంగాణ బీజేపీ నాయకత్వం సంయమనం పాటించినట్లు కనిపించింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి స్పందించినప్పటికీ తీవ్రస్థాయిలో వ్యాఖ్యలు చేయలేదు. దీంతో పార్టీ హైకమాండ్ వైఖరిపై రాజకీయ వర్గాల్లో చర్చ నడిచింది.

కానీ తాజాగా బీజేపీ స్టాండ్ మార్చినట్లు స్పష్టమైంది. సోమవారం పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు బండి సంజయ్‌కు బహిరంగ మద్దతు ప్రకటించారు. సంజయ్ ఎలాంటి తప్పు చేయలేదని, రాజకీయ లాభం కోసం బీజేపీని లక్ష్యంగా చేసుకుంటే సహించబోమని హెచ్చరించారు.

కుటుంబ సభ్యులు తప్పు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటారని, దానికి తండ్రిని బాధ్యుడిని చేయడం సరికాదని పేర్కొన్నారు. బీఆర్ఎస్‌కు ఈ అంశంపై మాట్లాడే నైతిక హక్కు లేదని మండిపడ్డారు.

ఢిల్లీ మద్యం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత జైలుకు వెళ్లిన సమయంలో కేసీఆర్, కేటీఆర్ రాజీనామా చేశారా అని ప్రశ్నించారు. ఇప్పుడు బండి సంజయ్ రాజీనామా కోరడం రాజకీయ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.

ఇదే సమయంలో ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డి కూడా ఈ వ్యవహారంపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసు పూర్తిగా రెండు కుటుంబాల మధ్య జరిగిన వివాదమని, దీనికి రాజకీయ రంగు పులమడం సరికాదని పేర్కొన్నారు. కొన్ని వీడియోలు తమ దృష్టికి వచ్చాయని, వాటిని పరిశీలిస్తే రెండు కుటుంబాల మధ్య ఎంత సాన్నిహిత్యం ఉందో అర్థమవుతుందని అన్నారు.

బాధిత యువతి కుటుంబం, భగీరథ్ కుటుంబం మధ్య గతంలో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని రాకేశ్ రెడ్డి తెలిపారు. చిన్నప్పటి నుంచి ఇరు కుటుంబాలు కలిసి తిరిగేవని, శ్రీశైలం, అరుణాచలం వంటి పుణ్యక్షేత్రాలకు కూడా కలిసి వెళ్లిన సందర్భాలు ఉన్నాయని చెప్పారు. పరిస్థితులు మారడంతో ఈ వివాదం బయటకు వచ్చిందని, చివరకు రెండు కుటుంబాలు కూర్చొని సమస్యను పరిష్కరించుకుంటాయనే నమ్మకం తనకు ఉందని పేర్కొన్నారు.

రామచంద్రరావు చేసిన వ్యాఖ్యలతో బండి సంజయ్‌కు బీజేపీ కేంద్ర నాయకత్వం పూర్తి మద్దతు ఉన్నట్లు స్పష్టమవుతోందని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఢిల్లీ స్థాయిలో చర్చల అనంతరమే రాష్ట్ర బీజేపీ దూకుడు పెంచిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## తనయుని జ్ఞాపకర్థం వైకుంఠ రథాన్ని అందచేత




**కొండాపూర్, మే20(సిరి న్యూస్):**

తనయుడి జ్ఞాపకర్థం రూ. 3లక్షల సొంత నిధుల ఖర్చుతో గ్రామానికి వైకుంఠ రథాన్ని అందజేసి మానవత్వం చాటుకున్నాడు. బుధవారం గుంతపల్లి గ్రామానికి అందజేసిన వైకుంఠ రథాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి ప్రారంభించి మాట్లాడారు. గుంతపల్లి గ్రామానికి చెందిన కలాల్ రామచందర్ గౌడ్ తన తనయుడు నిఖిల్ గౌడ్ జ్ఞాపకార్థం సొంత నిధులు ఖర్చు చేసి గ్రామ ప్రజల అత్యవసరాలకు చేయూతనివ్వడం మంచి పరిణామం అన్నారు. పుట్టిన ప్రతి మానవునికి గిట్టక మానదనే అర్థానికి పరమార్థం తెలిసేలా నిలిచే పనిచేయడం ఆదర్శంగా ఉందన్నారు. నిరుపేదగా పుట్టిన రైతుబిడ్డగా పదిమంది మేలుకోరే వ్యక్తిగా ఆయన ఆలోచనకు హర్షాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గుంతపల్లి కాంగ్రెస్ నాయకులు, యువకులు పాల్గొన్నారు.

## కేంద్రాన్ని ప్రారంభించిన ఏఎంసీ చైర్మన్ సుధాకర్ రెడ్డి

**క్వింటాల్‌కు రూ.3,699 మద్దతు ధర**

**ప్రతి ఎకరానికి గరిష్టంగా 10 క్వింటాళ్ల కొనుగోలు**



**మునిపల్లి, మే 20 (సిరి న్యూస్):**

మునిపల్లి మండలంలోని చెల్మెడ కలాన్ గ్రామంలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని ఏఎంసీ చైర్మన్ యం. సుధాకర్ రెడ్డి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు జొన్నలను ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరలకు విక్రయించకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి విక్రయించాలని సూచించారు. జొన్నలకు ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.3,699 మద్దతు ధర నిర్ణయించిందని తెలిపారు. ప్రతి ఎకరానికి గరిష్టంగా 10 క్వింటాళ్ల వరకు మాత్రమే కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు.కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాంరెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ దుర్గయ్య, గ్రామ సర్పంచ్ రాధాభాయ్ జోషి, గ్రామ శాఖ అధ్యక్షుడు ప్రభాకర్, సొసైటీ డైరెక్టర్లు, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, పీఏసీఎస్ కార్యదర్శులు శివారెడ్డి, వినోద్, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిని సన్మానిచించిన గొల్లపల్లి నాయకులు



**మే 20 (సిరి న్యూస్):**

కొండాపూర్ మండలానికి నూతనంగా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా ఎంపికైన మల్లారెడ్డికి గొల్లపల్లి కాంగ్రెస్ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, సత్యనారాయణ మాట్లాడుతూ పార్టీకి చేసిన సేవలు గుర్తింపుగా మల్లారెడ్డిని అధ్యక్షుడినగా నియమించినందుకు మాజీ ఎమ్మెల్యే, టిపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి, టీజీఐఐసి చైర్పర్సన్ నిర్మలా జగ్గారెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీ శ్రేయోభిలాషిగా, పార్టీ బలోపేతానికి అనేక రకాలుగా కష్టపడ్డ వ్యక్తికి అధ్యక్ష పదవి దక్కడం అభినందనీయమన్నారు. పార్టీ కోసం పనిచేసిన ప్రతి వ్యక్తికి దేశ,రాష్ట్ర, జిల్లా నామినేటెడ్, పార్టీ నాయకులుగా నియమించడం ఒక కాంగ్రెస్ తోటే సాధ్యమన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం ఆరు గ్యారంటీల అమలు నిరంతరం కొనసాగించడం కాంగ్రెస్ పార్టీకే దక్కింది అన్నారు. ఈ కార్యక్రమంలో అనంతరం గౌడ్, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు

## సాంస్కృతిక కళలకు నెలవు మెదక్

**జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**


**మెదక్ మే,20(సిరిన్యూస్)**

మెదక్ జిల్లా సాంస్కృతిక కళలకు నెలవని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు.ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ మీటింగ్ హాల్లో యువజన కేంద్రాల శాఖ ఆధ్వర్యంలో బుధవారం జానపద , సంస్కృత కార్యక్రమాలు నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. మెదక్ జిల్లా కళలకు నెలవన్నారు. వివిధ సంస్కృతి సాంప్రదాయాలకు పెట్టింది పేరు అని అన్నారు. భవిష్యత్ లో కళలకు మరింత గుర్తింపు తేవాలన్నారు. విద్యార్థుల జానపద డ్యాన్స్ అలరించాయి. జానపద డ్యాన్స్ లో ప్రతిభ చూపించిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు అందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా యువజన ,క్రీడల అధికారి రమేష్, జిల్లా పరిశ్రమల అధికారి ప్రకాష్ రావు, తాసిల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

# చరిత్ర ఆనవాళ్లుకు ప్రసిద్ధి మెదక్

- అందమైన పర్యాటక ప్రాంతాలకు నెలవు మెదక్ దుర్గం.
- సుసంపన్నమైన చారిత్రక మరియు సాంస్కృతిక వారసత్వాన్ని కలిగి ఉన్న ప్రాంతం.
- జిల్లాలో ఉన్న అన్ని పర్యాటక ప్రాంతాలపై డాక్యుమెంటరీ తయారీ.
- పర్యాటక వారోత్సవాల" సందర్భంగా మెదక్ లో హెరిటేజ్ వాక్.
- జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్,అదనపు కలెక్టర్ నగేష్,

**మెదక్ మే,20(సిరిన్యూస్)**



చరిత్రకు ఆనవాళ్లు మెదక్ అందమైన పర్యాటక ప్రాంతాలని, భావితరాలకు చారిత్రాత్మక ఉనికి అందించేలా డాక్యుమెంటరీ తయారీ చేసే విధంగా చర్యలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు.బుధవారం 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక "పర్యాటక వారోత్సవాల" సందర్భంగా హెరిటేజ్ వాక్ లో అదనపు కలెక్టర్ నగేష్ డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ ,మెదక్ ఆర్డీవో రమాదేవి, మత్స్య శాఖ అధికారి మల్లేశం యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి,డిపిఓ యాదయ్య, ఇరిగేషన్ ఈ.ఈ శ్రీనివాస్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు, వ్యాయామ ఉపాధ్యాయులు, యువత, క్రీడాకారులు, మున్సిపల్ సిబ్బంది తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు.వెస్లీ పాఠశాల,మెదక్ చర్చి, గుల్షన్ క్లబ్ అనంతరం మెదక్ పోర్ట్ ను సందర్శించి హెరిటేజ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మెదక్ జిల్లా సుసంపన్నమైన చారిత్రక మరియు సాంస్కృతిక వారసత్వాన్ని కలిగి ఉందన్నారు.మెదక్ జిల్లా పర్యాటక ప్రాంతాల. ఉనికి భావితరాలకు అందించేలా జిల్లాలో ఉన్న అన్ని పర్యాటక ప్రాంతాలపై డాక్యుమెంటరీ తయారీ చేస్తున్నట్లు వివరించారు. మెదక్ చర్చ్,గోల్ బంగ్లా. బారాకమాన్,మెదక్ పోర్ట్ ఆ ప్రాంతాలను సందర్శించి చరిత్రను తెలుసుకోవడం జరిగిందన్నారు. మెదక్ పోర్ట్ అనేది చారిత్రాత్మక పర్యాటక ప్రాంతంగా పర్యాటకులను ఆకర్షిస్తుందన్నారు.మెదక్ పట్టణానికి అత్యంత దగ్గరగా ఉంటుందని పర్యాటకుల తాకిడి ఎక్కువగా ఉంటుందన్నారు.మెదక్ పోర్ట్ ప్రాంతంలో మరమ్మత్తులకు అవకాశం ఉన్నందున ఈనెల 22 రోజున హెరిటేజ్ ప్రాంతాలను హైలెట్ చేయడంలో భాగంగా మరమ్మత్తులు నిర్వహించి శానిటేషన్ డ్రైవ్, లైటింగ్ ఏర్పాటుచేసి యువతను పర్యాటకులను ఆకర్షించే విధంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. జిల్లాలో ఉన్న పర్యాటక ప్రాంతాలను ప్రాధాన్యతనిస్తూ భావితరాలకు అందించే విధంగా దృష్టి సారిస్తున్నట్లు వివరించారు. అన్ని హెరిటేజ్ ప్రాంతాలను మున్సిపల్ కమిషనర్ జిల్లా పంచాయతీ శాఖ సమన్వయంతో ఒక ప్రణాళిక ప్రకారం జిల్లాలో ఉన్న ఆ ప్రాంతాలను చరిత్ర పుటల్లోకి ఎక్కిన పర్యాటక ప్రాంతాలైన , బురుజులు, చారిత్రాత్మక దేవాలయాలు, డాక్యుమెంటరీ తయారు చేసి హెరిటేజ్ పుస్తక రూపంలో భద్రపరుస్తా మన్నారు .పర్యాటక ప్రాంతాలలో పర్యాటకులకు రిహాబిటేషన్ సౌకర్యం కల్పించడానికి సిఎస్ఆర్ ఫండ్స్ స్టేట్ లెవెల్ నిధులను దరఖాస్తు చేయిస్తామన్నారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు,యువత, క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





# రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు

**తూప్రాన్ మే 20 సిరి న్యూస్**



తూప్రాన్ మండలం ఇమాంపూర్ గ్రామంలో బుధవారం జాతీయ వ్యవసాయ పరిశోధన అకాడమీ ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తల కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో జాతీయ పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సూర్య రాథోర్ ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వ్యవసాయంలో రసాయన ఎరువులు అధికంగా వాడడం వలన నేల ఆరోగ్యం క్షీణించడం మే కాకుండా వ్యవసాయంలో ఖర్చు పెరుగుతుంది ఈ సమస్యను అధిగమించడానికి సమతుల్యంగా రసాయన సేంద్రియ ఎరువులు వాడుకోవాలి రైతులకు సూచించారు . ప్రొఫెసర్ డాక్టర్ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ వరి పంటకు ప్రత్యామ్నాయంగా పెసర మినుము కంది లాంటి ఆరుతడి పంటలు ఆయిల్ ఫామ్ లాంటి ఉద్యాన పంటలు పండించుకోవాలని సూచించారు. శాస్త్రవేత్త డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ మన ప్రాంతంలోని ఎర్ర చలక నేలలు సేంద్రీయ కార్బన్ తక్కువగా ఉండటం వలన పంటలు దిగుబడులు తగ్గిపోతూ ఉన్నాయి కాబట్టి పచ్చిరొట్ట ఎరువులు వేసుకుని కలియ దున్నాలని తెలిపారు. మండల వ్యవసాయ అధికారి గంగుమల్లు మాట్లాడుతూ రైతులకు పచ్చరొట్ట ఎరువుల విత్తనాలు చౌడు నెలల్లో వేసుకోవడానికి జిప్సం ను అందుబాటులో ఉంచుతామని రైతులకు హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ నవీన్ కుమార్ సీనియర్ శాస్త్రవేత్త కలదీప్ చౌదరి హిమాంపూర్ గ్రామ సర్పంచ్ స్వరూప నవీన్ గౌడ్ ఉప సర్పంచ్ నాగేష్ పంచాయతీ సెక్రెటరీ లావణ్య వ్యవసాయ అధికారి సంతోష్ భారీ సంఖ్యలో రైతు సోదరులు పాల్గొన్నారు

# ఇచ్చిన హామీలను తప్పే ప్రసక్తి లేదు.

- విడతల వారిగా సమస్యలను పరిష్కరిస్తాం.
- ఎంఎస్ఎస్ఓ ద్వారా బోరు మోటర్లు ప్రారంభించిన మైన0పల్లి హనుమంతరావు.

**రామాయంపేట, (నిజాంపేట) మే 20 (సిరి న్యూస్)**



ఎంఎస్ఎస్ఓ ద్వారా బోరు మోటార్లు అందించి, మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ప్రారంభించారు.ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విడతల వారీగా పూర్తి చేస్తుందని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు అన్నారు. నిజాంపేట మండల పరిధిలోని నందిగామ, తిప్పన్నగుల్ల గ్రామాల్లో ఎంఎస్ఎస్ఓ ద్వారా బోరు మోటార్లను అందించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీటి సమస్యలు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులకై తమ స్వంత నిధులతో కిచెన్ షెడ్లు, మరుగుదొడ్లు నిర్మాణానికి పనులను ప్రారంభించి పాఠశాలలు ప్రారంభించే సమయానికి అందు బాటులోకి తెస్తామని చెప్పారు. ముఖ్యంగా ప్రభుత్వ పథకాలతో పాటు msso ద్వారా ఎన్నో సేవాకార్యక్రమాలు చేస్తున్నామని, మండలంతో పాటు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పర్చేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.మహా రుద్రాభిషేకం లో పాల్గొన్న మైనంపల్లి సిద్ధ రామేశ్వరునికి ప్రత్యేక పూజలు .కామారెడ్డి జిల్లా భిక్కనూరు శ్రీ సిద్ధి రామేశ్వర స్వామి ఆలయంలో శ్రీ శ్రీ శ్రీ మాధవానంద సరస్వతి ఆధ్వర్యంలో బుధవారం మహా రుద్రాభిషేకం ఘనంగా నిర్వహించారు. కాగా రామాయంపేట మునిసిపల్ చైర్మన్ గజవాడ లావణ్య నాగరాజు గుప్తా ఆధ్వర్యంలో సుమారు 4 వేల మందికి అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే హనుమంతరావు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో పూజారులు కొడకండ్ల రామగిరి శర్మ, రాజు శర్మ మాజీ ఎమ్మెల్యే వైనం పల్లి హనుమంతరావుకు, ఆయన వెంట వచ్చిన ప్రముఖులకు ఆశీర్వచనం చేశారు.

# ఓటరు జాబితా సవరణ షెడ్యూల్ విడుదల

- అక్టోబర్ 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు అర్హులు
- జూన్ 25 నుంచి జూలై 24 వరకు ఇంటింటి సర్వే
- అక్టోబర్ 1కి తుది ఓటరు జాబితా విడుదల

**సంగారెడ్డి, సిరి న్యూస్:**

అర్హత తేదీగా నిర్ణయించి, రాజ్యాంగంలోని ఆర్టికల్ 324, ప్రజా ప్రాతినిధ్య చట్టం–1950 లోని సెక్షన్ 21 ప్రకారం ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన వివిధ దశల షెడ్యూల్‌ను విడుదల చేశారు. దీని ప్రకారం జూన్ 15 నుండి జూన్ 24 వరకు సిబ్బందికి శిక్షణ, ప్రింటింగ్ తదితర ఏర్పాట్లు పూర్తి చేసి, జూన్ 25 నుండి జూలై 24 వరకు జిల్లావ్యాప్తంగా విస్తృతంగా ఇంటింటి సర్వే నిర్వహించనున్నారు. ఈ సర్వేలో భాగంగా బూత్ స్థాయి అధికారులు ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్లకు ఎన్యూమరేషన్

కనీసం మూడు సార్లు బీఎల్ఓలు ఆ ఇంటిని సందర్శిస్తారని, ఓటర్లు తమ వివరాలను ఆన్‌లైన్ ద్వారా కూడా సమర్పించవచ్చని తెలిపారు. నింపిన ఫారాలను అందజేసిన అనంతరం ఓటర్లకు రసీదు (అక్నాలెడ్జ్‌మెంట్) ఇస్తారు. అనంతరం జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించి, ఆగస్టు 30 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలను స్వీకరిస్తారు. కొత్త ఓటరు నమోదు కోసం ఫారం–6, సవరణల కోసం ఫారం–8 ఉపయోగించుకోవాలని, అన్ని అభ్యంతరాల పరిష్కారం తర్వాత అక్టోబర్ 1, 2026న తుది ఓటరు జాబితాను విడుదల చేస్తామని అధికారులు పేర్కొన్నారు. అర్హులైన ప్రజలందరూ

# మెదక్ అభివృద్ధే లక్ష్యం

- కవితమ్మను భవిష్యత్ సీఎం చేస్తాం
- రూ 3లక్షల జీతాన్ని వదులుకొని కవితమ్మ తో నడుస్తున్నాం
- మా నాన్నగారే మాకు స్ఫూర్తి
- సర్వోదయ తెలంగాణ నిర్మాణమే తమ లక్ష్యం
- తెలంగాణ రక్షణ సేన(తేరాస) నేత బట్టి అజయ్ సంచలన వ్యాఖ్యలు

**మెదక్ ప్రతినిధి, మే20(సిరి న్యూస్)**



మెదక్ జిల్లా అన్ని రంగాల్లో వెనుకబడిపోయిందని, గత పాలకుల నిర్లక్ష్యమే దీనికి ప్రధాన కారణమని తెలంగాణ రక్షణ సేన(తేరాస) నాయకుడు బట్టి అజయ్ తీవ్రస్థాయిలో విమర్శించారు. మెదక్‌కు చారిత్రక గుర్తింపు ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ సమాజ నిర్మాణం, ఉచిత విద్యా–వైద్యం లక్ష్యాలతోనే తాము కవితమ్మ వెంట నడుస్తున్నామని స్పష్టం చేశారు.బుధవారం మెదక్ పట్టణంలోని టిఎన్జిఓ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకర్లతో మాట్లాడారు. తాను అధిక వేతన ఉద్యోగాన్ని వదిలి ప్రజాసేవ కోసం వచ్చానన్నారు. "మూడు లక్షల జీతం వచ్చే ఉద్యోగాన్ని వదిలి కవితమ్మ ఆశయాల కోసం పనిచేస్తున్నాం. ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం" అని తెలిపారు.సమాజంలోని ప్రతి వర్గానికీ న్యాయం జరిగేలా సర్వోదయ తెలంగాణ నిర్మాణమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. తమ తండ్రే తమకు స్ఫూర్తి అని, ఆయన ఆశయాలతోనే ముందుకు సాగుతున్నామని చెప్పారు.ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులకు పరీక్షల కోసం ఎగ్జామ్ ప్యాడ్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. విద్యకు ప్రాధాన్యత ఇస్తూ భవిష్యత్ తరాలకు అండగా నిలుస్తామని అన్నారు.రాష్ట్ర పునర్వ్యవస్థీకరణల తర్వాత కూడా మెదక్ జిల్లా అభివృద్ధిలో వెనుకబడిందని బట్టి అజయ్ ఆరోపించారు.1957 నుంచి నేటి వరకు మెదక్‌కు సరైన గుర్తింపు రాలేదు. డిగ్రీలు చేసిన యువత కూడా కూలీ పనులకు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని వాపోయారు. మెదక్ ప్రాంతంలో పరిశ్రమలు లేకపోవడంతో స్థానిక యువత ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పరిశ్రమలు స్థాపిస్తేనే ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. మెదక్ గడ్డపై పుట్టిన నాయకులకు రాజకీయంగా సరైన గుర్తింపు దక్కలేదని వ్యాఖ్యానించారు. స్థానిక నాయకత్వాన్ని అణగదొక్కే రాజకీయ ధోరణులు కొనసాగుతున్నాయని విమర్శించారు.చారిత్రక, సాంస్కృతిక వారసత్వం ఉన్న మెదక్‌ను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని అన్నారు. టూరిజం అభివృద్ధి చేస్తే వేలాది మందికి ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు.పరిపాలన సౌలభ్యం పేరుతో ప్రభుత్వ కార్యాలయాలు, స్పోర్ట్స్ కార్యాలయాలు ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారని మండిపడ్డారు. మెదక్‌ను చిన్న జిల్లా చేసి మరింత వెనక్కు నెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు.తమ ట్రస్ట్ ద్వారా ఇప్పటివరకు 3582 మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామని బట్టి అజయ్ వెల్లడించారు. యువతకు ఆర్థిక స్వావలంబన కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమన్నారు. ప్రస్తుత ప్రజాప్రతినిధులు రెగ్యులర్ పరిపాలనకే పరిమితమవుతున్నారని, అసెంబ్లీలో మెదక్ సమస్యలపై గట్టిగా మాట్లాడటం లేదని విమర్శించారు.ముఖ్యమంత్రితో చర్చించి జిల్లా అభివృద్ధికి నిధులు తేవడంలో విఫలమయ్యారని ఆరోపించారు.ప్రతి కుటుంబానికి ఉచిత విద్య, వైద్యం అందించాలన్న లక్ష్యంతోనే తాము కవితమ్మ వెంట నడుస్తున్నామని చెప్పారు. "దాసోహం అయ్యా... అందుకే టిఆర్ఎస్‌లో చేరాను" అంటూ భావోద్వేగ వ్యాఖ్యలు చేశారు.తెలంగాణకు రూ.1.82 లక్షల కోట్ల ఆదాయం ఉందని పేర్కొంటూ, ప్రజా సంక్షేమానికి భారీగా నిధులు ఖర్చు చేసే సామర్థ్యం రాష్ట్రానికి ఉందన్నారు."రూ.30 వేల కోట్ల నుంచి రూ.60 వేల కోట్ల వరకు ప్రజల కోసం పెట్టేందుకు కవితక్క సిద్ధంగా ఉంది" అని వ్యాఖ్యానించారు.చిన్న వ్యాపారులకు బ్యాంకులతో సంబంధం లేకుండా రూ.2 లక్షల నుంచి రూ.2 కోట్ల వరకు ఆర్థిక సహాయం అందించే విధానాన్ని తీసుకువస్తామని తెలిపారు. యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమన్నారు.బిఆర్ఎస్ లో హరీష్ రావ్ మెదక్ ఇంచార్జిగా ఉన్నంతకాలం స్థానిక నాయకులకు సరైన గుర్తింపు దక్కదని బట్టి అజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. మెదక్ నాయకత్వాన్ని బలోపేతం చేసే సమయం వచ్చిందన్నారు.మెదక్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రపంచ పటంలో నిలబెడతామని ప్రకటించారు. యువత, మహిళలు, రైతులు, కార్మికుల అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమన్నారు.ప్రస్తుతం వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తెలంగాణ రక్షణ సేనలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ అజెండా అని చెప్పారు.తెలంగాణ భవిష్యత్ నాయకత్వం కవితమ్మదేనని బట్టి అజయ్ ధీమా వ్యక్తం చేశారు. ప్రజల ఆశయాలను నెరవేర్చగల శక్తి కవితకు మాత్రమే ఉందని పేర్కొంటూ, కవితమ్మను సీఎం చేస్తామని అని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో బిఆర్ఎస్ జిల్లా ఇంచార్జ్ చంద్రశేఖర్ జిల్లా నాయకులు రమేష్ గౌడ్, విద్యార్థి విభాగం నాయకులు భగత్ తెలంగాణ రక్షణ సేనా నాయకులు కేవల్ నందకిషోర్, గణేష్, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

## పటాన్‌చెరు తొంబ్స్ వద్ద హెరిటేజ్ వాక్

**ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా టూరిజం వారోత్సవాలు**

**చారిత్రక కట్టడాల పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత**

**వారసత్వ సంపదపై యువతకు అవగాహన కల్పించడమే లక్ష్యం**

**జిల్లా టూరిజం అధికారి అఖిలేష్ రెడ్డి**

**పటాన్ చెరు, సిరి న్యూస్:**




ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న 99 రోజుల కార్యక్రమాల్లో భాగంగా, టూరిజం వారోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం పటాన్‌చెరు తొంబ్స్ వద్ద హెరిటేజ్ వాక్ కార్యక్రమాన్ని జిల్లా టూరిజం శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ చారిత్రక నడకలో విద్యార్థులు, యువత, మున్సిపల్ అధికారులు, టూరిజం శాఖ సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పటాన్‌చెరు చారిత్రక కట్టడాల ప్రాముఖ్యతను చాటిచెప్పేలా ఈ కార్యక్రమం సాగింది. ఈ సందర్భంగా జిల్లా టూరిజం శాఖ అధికారి అఖిలేష్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో ఉన్న చారిత్రక, సాంస్కృతిక వారసత్వ కట్టడాలను కాపాడుకోవడం మన అందరి బాధ్యత అని అన్నారు. పటాన్‌చెరు తొంబ్స్ ఈ ప్రాంత ఘన చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్నాయని, యువతలో ఈ వారసత్వ సంపదపై మక్కువ, అవగాహన పెంపొందించేందుకు హెరిటేజ్ వాక్‌లు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. టూరిజం వీక్‌లో భాగంగా జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని, విద్యార్థులు చరిత్రను అధ్యయనం చేసి, ప్రాచీన కట్టడాల సంరక్షణలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## భారతి నగర్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

**జోనల్ కమిషనర్‌ను కలిసిన సింధు ఆదర్శ్ రెడ్డి**



**రామచంద్రపురం, మే 20, (సిరి న్యూస్):**

భారతి నగర్ డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి పెట్టి వాటిని త్వరితగతిన పూర్తి చేయాలని తాజా మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి జోనల్ కమిషనర్ నారాయణ అమిత్‌ను కోరారు. ఈ మేరకు ఆమె బుధవారం జోనల్ కమిషనర్‌ను కలిసి పలు అభివృద్ధి అంశాలపై వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా సింధు మాట్లాడుతూ, తన హయాంలో మంజూరైన పలు అభివృద్ధి పనులు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయని పేర్కొన్నారు. ఆయా పనులను వెంటనే పూర్తి చేసేలా సంబంధిత కాంట్రాక్టర్లకు ఆదేశాలు జారీ చేయాలని కోరినట్లు తెలిపారు.అలాగే బాంబే కాలనీలోని కమ్యూనిటీ హాల్ అద్దె ప్రస్తుతం ₹15 వేలుగా ఉండటంతో సాధారణ ప్రజలకు ఇబ్బందిగా మారుతోందన్నారు. ఆ ప్రాంతం స్లమ్ ఏరియా కావడంతో ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా కనీస అద్దెను నిర్ణయించాలని విజ్ఞప్తి చేశారు.బాంబే కాలనీ రైతు బజార్‌కు సంబంధించిన టెండర్ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో, దుకాణాల కేటాయింపును వెంటనే చేపట్టి రైతు బజార్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.అదేవిధంగా ఎంఎంటీఎస్ హాల్ట్ రోడ్ నుంచి అన్నమయ్య ఎన్‌క్లేవ్ వరకు ప్రతిపాదిత బీటీ రోడ్డు పనులను త్వరితగతిన ప్రారంభించి పూర్తి చేయాలని కోరారు.తాము ప్రస్తావించిన అంశాలను సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని జోనల్ కమిషనర్ నారాయణ అమిత్ హామీ ఇచ్చినట్లు సింధు ఆదర్శ్ రెడ్డి తెలిపారు.

# ట్రాఫిక్ పోలీసుల ఆరోగ్యం, భద్రత మా బాధ్యత

- ఎండలు, వర్షా ల నుంచి రక్షణకు ప్రత్యేక కిట్ల పంపిణీ
- ప్రజల సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా పని చేయాలి
- జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్

**సంగారెడ్డి, సిరి న్యూస్:**

సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా ఎండలు, వర్షాలను లెక్కచేయకుండా రోడ్లపై నిరంతరం విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది సంరక్షణకు జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. విధి నిర్వహణలో సిబ్బందికి రక్షణ కల్పించేందుకు 9 రకాల వస్తువులతో కూడిన ప్రత్యేక కిట్లను జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ బుధవారం పోలీసులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజల ప్రయాణాలు సజావుగా సాగేలా రాత్రింబవళ్లు శ్రమిస్తున్న ట్రాఫిక్ పోలీసుల ఆరోగ్యాన్ని కాపాడటం తమ బాధ్యత అని, అందుకోసమే ఈ సామగ్రిని పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సిబ్బందికి అందజేసిన ఈ ప్రత్యేక కిట్లలో క్యాప్, కూలింగ్ గ్లాసెస్, రెండు రిఫ్లెక్టివ్ జాకెట్లు, రెయిన్ కోటు, వాటర్ బాటిల్, లైటింగ్ బ్యాటన్, షోల్డర్ లైట్‌తో కూడిన బ్యాగ్ తదితర వస్తువులు ఉన్నాయి. ఈ ఆధునిక పరికరాలు విధి నిర్వహణలో సిబ్బందికి ఎంతో ఉపయోగపడతాయని, రాత్రి వేళల్లో ప్రమాదాల నివారణకు తోడ్పడతాయని ఎస్పీ పేర్కొన్నారు. రోడ్డు భద్రతా నియమాలను కఠినంగా




అమలు చేస్తూ, ప్రమాదాల రహిత జిల్లాగా సంగారెడ్డిని మార్చాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చైతన్య రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు రమేష్, కిరణ్ కుమార్, ప్రవీణ్ రెడ్డి మరియు ట్రాఫిక్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

# బస్సు స్టాప్‌లలో మొబైల్ ఫోన్లు దొంగిలిస్తున్న ఇద్దరు అరెస్ట్..

- 7 మొబైల్ ఫోన్లు, ఆటో స్వాధీనం..

**హత్నూర, మే 20,(సిరి న్యూస్)**

హత్నూర పోలీస్ స్టేషన్ పరిధిలో బస్సు స్టాప్‌లు, రన్నింగ్ బస్సుల్లో ప్రయాణికుల మొబైల్ ఫోన్లు దొంగిలిస్తున్న ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల వద్ద నుంచి మొత్తం 7 మొబైల్ ఫోన్లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకున్నారు.పోలీసుల వివరాల ప్రకారం. మంగళవారం దౌల్తాబాద్ బస్ స్టాప్ వద్ద ఓ మహిళ బస్సు ఎక్కుతున్న సమయంలో ఆమె బ్యాగ్‌లో ఉన్న వివో మొబైల్ ఫోన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. ఈ ఘటనపై బాధితురాలి భర్త మాల విక్రం హత్నూర పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.దర్యాప్తులో భాగంగా బుధవారం దౌల్తాబాద్ తెలంగాణ తల్లి చౌరస్తా వద్ద పోలీసులు వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో ఇద్దరు అనుమానితులు పోలీసులను చూసి పారిపోవడానికి ప్రయత్నించగా, వెంటనే అదుపులోకి తీసుకుని విచారించారు. విచారణలో బస్సు స్టాప్‌లు, రద్దీగా ఉన్న రన్నింగ్ బస్సుల్లో ప్రయాణికుల మొబైల్ ఫోన్లు దొంగిలిస్తున్నట్లు ఒప్పుకున్నారని పోలీసులు తెలిపారు.నిందితులు భువనగిరి జిల్లా చౌటుప్పల్ బస్టాండ్, సిద్దిపేట జిల్లా వంటిమామిడి బస్ స్టాండ్, మెదక్ జిల్లా నర్సాపూర్ బస్టాండ్ ప్రాంతాల్లో మొబైల్ ఫోన్లు దొంగిలించినట్లు విచారణలో వెల్లడైంది.

**అరెస్టు చేసిన నిందితులు:**





బెడంపల్లి ఎల్లప్ప (33), ఆటో డ్రైవర్, స్వస్థలం కర్నూలు జిల్లా డోన్ మండలం తారక్ నగర్, ప్రస్తుతం ఎల్‌బి నగర్ హనుమాన్ గల్లిలో నివాసం.ఉయ్యూరు శ్రీనివాస్ రావు (25), వ్యవసాయదారుడు, స్వస్థలం గుంటూరు జిల్లా పెదకాకాని మండలం హనుమర్లపూడి గ్రామం, ప్రస్తుతం ఎల్‌బి నగర్ హనుమాన్ గల్లిలో నివాసం ఉంటున్నాడు.నిందితుల వద్ద నుంచి వివో, రెడ్‌మి, ఓప్పో, నోకియా, లావా, మోటో కంపెనీలకు చెందిన మొత్తం 7 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.85 వేల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. అలాగే నేరాలకు ఉపయోగించిన టీ ఎస్ 27 టీ 5328 నంబరు గల బజాజ్ ఆటోను కూడా స్వాధీనం చేసుకున్నారు.ప్రధాన నిందితుడు బెడంపల్లి ఎల్లప్పపై గతంలో పలు పోలీస్ స్టేషన్లలో దొంగతనం కేసులు, ఎన్ డి పి ఎస్ చట్టం, ఐ టీ చట్టాలకు సంబంధించిన కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. అతనిపై మొత్తం తొమ్మిది కేసులు ఉన్నట్లు దర్యాప్తులో తేలింది.ఇద్దరు నిందితులు అలవాటుగా బస్సు స్టాప్‌ల వద్ద గుంపుల్లో ఉన్న ప్రజలను లక్ష్యంగా చేసుకుని మొబైల్ ఫోన్లు దొంగిలిస్తూ జీవనం సాగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. అనంతరం నిందితులను జిన్నారం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా, కోర్టు వారికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.ఈ సందర్భంగా పోలీసులు ప్రజలకు సూచిస్తూ. రద్దీ బస్సుల్లో ప్రయాణించే సమయంలో తమ విలువైన వస్తువులు, మొబైల్ ఫోన్లను జాగ్రత్తగా భద్రపరచుకోవాలని కోరారు.ఈ కేసును ఛేదించడంలో హత్నూర ఎస్ఐ ఎ. శ్రీధర్ రెడ్డి, కానిస్టేబుళ్లు కృష్ణ, ప్రతాప్‌లు కీలకంగా పనిచేసినట్లు అధికారులు తెలిపారు.





## పకడ్బందీగా ఎస్ఐఆర్ మ్యాపింగ్

**మెదక్ ఆర్డీవో రమాదేవి**



**మెదక్ మే,20(సిరిన్యూస్)**

ఎస్ఐఆర్ మ్యాపింగ్ పటిష్టంగా నిర్వహించాలని మెదక్ ఆర్డీవో రమాదేవి పేర్కొన్నారు.బుధవారం మెదక్ ఆర్డివో కార్యాలయంలో బి ఎల్ ఓ లతో సమావేశం నిర్వహించారు. ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియలో బీఎల్ఓల పనితీరును నిరంతరం పర్యవేక్షిస్తూ, లక్ష్యాలకు అనుగుణంగా మ్యాపింగ్ పూర్తి చేయాలన్నారు.క్షేత్రస్థాయిలో ఖచ్చితమైన ధృవీకరణ, సరైన డేటా నమోదు, పారదర్శకతతో పని చేయాలన్నారు.రాష్ట్రంలో ప్రత్యేక సమగ్ర ఓటరు సవరణ ప్రక్రియను జూన్ 24 నుంచి జులై 25 వరకు చేపట్టనున్నారన్నారు. ఈ సమయంలో బీఎల్ఓలు ఇంటింటి సర్వే నిర్వహించి, ఎన్యూమరేషన్ ఫారాల ద్వారా వివరాలు సేకరిస్తారన్నారు. ప్రజలకు తమ ప్రాంతంలోని బీఎల్ఓ ఎవరో తెలిసేలా, వారి పేరు, మొబైల్ నంబర్, పోలింగ్ కేంద్రం వివరాల గురించి చర్యలు తీసుకోవాలని, విస్తృత ప్రచారం చేపట్టాలన్నారు.ఫారం–6, 7, 8 ద్వారా వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిశీలించి, మరణించిన ఓటర్ల వివరాలను ధృవీకరించి, తొలగింపు ప్రక్రియ చేపట్టాలని సూచించారు.బదిలీ ఓటర్లు, మరణించిన ఓటర్ల వివరాలను సక్రమంగా పరిశీలించి, రికార్డులను నవీకరించాలని తెలిపారు.బీఎల్ఓలు పాస్వర్డ్ లను ఎవరితోనూ పంచుకోవద్దని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఐఆర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# పుల్-అప్స్‌తో ఫుల్ ప్రయోజనాలు..

పుల్‌అప్స్ అత్యంత ప్రభావవంతమైన ఎక్సర్‌సైజెస్‌లో ఒకటి. ఇవి మన శరీరం మొత్తంపై ప్రభావం చూపుతాయి. కేవలం మన శరీర బరువు ఆధారంగా చేసే ఈ ఎక్సర్‌సైజ్‌తో బోలెడన్ని ప్రయోజనాలు కలుగుతాయి. కానీ వీటిని చేయడం అనుకునేటంత ఈజీ కాదు. బిజీ లైఫ్ కారణంగా శరీర ఆకృతి, ఆరోగ్యంపై దృష్టి పెట్టే సమయం ఎవరికీ ఉండటం లేదు. ఎలాంటి నొప్పులు వ్యాధుల బాధలు లేకుండా బతకాలంలే రోజులో కాసైపైనా శరారీక శ్రమ చేయాల్సిన అవసరం ఉంది. అలా అని గంటల పాటు జిమ్‌లో గడపాల్సిన అవసరం లేదు. కేవలం కొన్ని నిమిషాల్లోనే శరీరాన్ని బలంగా, ఆకర్షణీయంగా మార్చే ఒక అద్భుతమైన వ్యాయామం ఉంది. అదే పుల్-అప్స్! పుల్-అప్స్ అనేవి ప్రత్యేకమైన ఎక్విప్‌మెంట్ అవసరం లేని, ఇంట్లోనే చేయగల పవర్‌ఫుల్ వ్యాయామం. మీరు ప్రారంభ దశలో ఉన్నవారైనా, రోజూ వ్యాయామం చేసేవారైనా సరే వీటిని చేయచ్చు. పుల్-అప్స్ అన్ని వయస్సుల వారికి అనుకూలమైనవి కూడా. ఈ వ్యాయామం ద్వారా మీ శరీరం బలపడటమే కాదు, మానసికంగా ధైర్యం, స్థిరత్వం కూడా పెరుగుతాయి.ఎక్కువ కష్టపడకుండా రోజూ ఉదయం కేవలం 20 పుల్-అప్స్ చేస్తే చాలు.

### పోస్టర్ మెరుగవుతుంది

పుల్‌అప్స్ చేయడం వల్ల వెనుక భాగంలోని కండరాలు బలపడతాయి. దీని వలన శరీర పోస్చర్ మెరుగువుతుంది. మనం నడిచే, కూర్చునే తీరు మెరుగవుతుంది. ఆఫీస్ లో ఎక్కువసేపు కూర్చొనే పనౌ చేసే వారికి నడుము నొప్పులు తగ్గుతాయి.



### శరీర బలం చేకూరుతుంది:

పుల్-అప్స్ సమయంలో వాడే ప్రధాన కండరాలు అంటే శరీరంలోని అన్ని భాగాలకు బలాన్ని చేకూరుస్తాయి. ఉదాహరణకు లాటిసిమస్ డోర్సి వీపు భాగాన్ని ఆకారంలోకి తేవడంలో సహాయపడుతుంది. అలాగే బైసెప్స్, ట్రైసెప్స్ చేతులకు బలాన్ని ఇస్తాయి. డెల్టాయిడ్స్ భుజాల స్థిరత్వాన్ని పెంచుతాయి. ఇలా శరీరంలోని కండరాలపై ఒత్తిడి పడి అవి బలంగా తయారవుతాయి.

### గ్రిప్ పెరుగుతుంది

రోజుకు 20 పుల్ అప్స్ చేయడం వల్ల చేతులు, వేళ్లలో బలం పెరుగుతుంది. ఇది వయస్సు పెరిగినాక వచ్చే చేతుల్లో వణకు, చేతులు బలం లేకపోవడం వంటి సమస్యలను తగ్గిస్తుంది. మంచి గ్రిప్ ఇస్తుంది. అంతేకాదు.. ఇతర వ్యాయామాలైన వంటి వాటిని చేసే సామర్థ్యాన్ని పెంచుతుంది.

### శరీరం ఆకర్షణీయంగా మారుతుంది

పుల్ అప్స్ వల్ల శరీరంపై మసిల్స్ రావడానికి చాలా బాగా సహాయపడుతుంది. "V-shaped torso" (పైన పొడవుగా, కింద తక్కువగా ఉన్న శరీర ఆకృతి) సాధ్యమవుతుంది.ఫిట్ గా, కాన్ఫిడెంట్ గా కనిపిస్తారు. ఆకర్షణీయంగా మారతారు.

### హార్మోన్ల సంతులనం

శక్తితో కూడిన వ్యాయామాలు ముఖ్యంగా పుల్-అప్స్ వంటి బాడీవెయిట్ ఎక్సర్సైజులు టెస్టోస్టెరోన్ లెవల్స్‌ను పెంచడంలో సహాయపడతాయి. ఇది మానసికరంగా, శారీరకంగా మిమ్మల్ని ధృఢంగా ఉంచుతుంది.


### మానసిక ధైర్యం

పుల్-అప్స్ చేయడం కొంచెం కష్టమైన వ్యాయామం. దీనిని ప్రతిరోజూ చేయడం వల్ల మీకు తెలియకుండానే మీలో క్రమశిక్షణ పెరుగుతుంది. మీలో పట్టుదల, మానసిక ధైర్యం పెరుగుతాయి. అన్నింటా ఆత్మవిశ్వాసంతో ఉండగలుగుతారు.

### బరువు తగ్గడానికి సహాయపడుతుంది

పుల్‌అప్స్ చేసే సమయంలో శరీరం ఎక్కువగా కేలరీలను ఖర్చు చేస్తుంది. దీని వల్ల ఫాట్ బర్న్ వేగంగా జరుగుతుంది. మెటబాలిజం పెరుగుతుంది. దీని వల్లల శరీరం వేగంగా కేలరీలను ఖర్చు చేస్తుంది. బరువు తగ్గుతుంది.

అయితే పుల్-అప్స్ చేసే సమయంలో కొన్ని జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని నిపుణులు చెప్తున్నారు. మీరు ఇంత వరకూ పుల్ అప్స్ చేయని వారేతే ఒకేసారి 20 పుల్ అప్స్ చేయకండి. నిదానంగా రోజుకు 5తో ప్రారంభించి కొద్ది కొద్దిగా పెంచుతూ రండి. ఇలా రోజుకు కేవలం 20 చేస్తే చాలు. మానసికంగా, శారీరకంగా ఫిట్ గా ఉండగలుగుతారు. అలాగే వీటిని ఎప్పుడు పడితే అప్పుడు చేయకండి. ఉదయాన్నే చేస్తేనే మెటబాలిజం యాక్టివ్ అయి రోజంతా శక్తితో నిండి ఉంటారు.



# జంతువులు కూడా ఆత్మహత్య చేసుకుంటాయి తెలుసా..!




ఆత్మహత్య.. ఏకారణం చేతనైనా ఎవరి ప్రమేయం లేకుండా తన ప్రాణాలను తానే తీసుకోవడాన్ని ఆత్మహత్య అంటారు. ఇది చాలా పెద్ద నేరం. న్యాయవ్యవస్థ కూడా ఒక వ్యక్తి ఆత్మహత్య చేసుకోవడాన్ని ఉపేక్షించదు. ఆత్మహత్యకు ప్రయత్నించిన వారిపై కఠిన చర్యలు కూడా తీసుకుంటుంది. ఇలాంటి ఆలోచనలు ఎవరికైనా వస్తుంటే వారికి కౌన్సిలింగ్ సెంట్రస్ ఉంటాయి. క్షణికావేశంలోనో.. భరించలేని బాధలోనో.. నిరాశ నిస్పృహలోనో చాలా మంది ఆత్మహత్యలకు పాల్పడుతుంటారు. అయితే ఇన్నాళ్లూ ఆత్మహత్య అంటే మనుషులే చేసుకుంటారని అంతా అనుకుంటున్నారు. కానీ కొన్ని జంతువులు కూడా ఆత్మహత్య చేసుకుంటాయని మీలో ఎంతమందికి తెలుసు.

**ఒత్తిడికి, తీవ్ర నిరాశకూ గురైనప్పుడు కుక్కలు కూడా ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచన చేస్తాయంట. ఈ సమయంలో వాటిని అవే గాయపరుచుకోవడం.. గోడలు ఎక్కి దూకడం.. పూర్తి నైరాశ్యంలో ఉన్నట్లుగా ఒకే చోట పడుకుని దీర్ఘంగా ఆలోచిస్తుండటం వంటివి కుక్కలు ఆత్మహత్య చేసుకోవడానికి గల ముందస్తు లక్షణాలు అని అంటున్నారు.**

ఇక పందులు కూడా ఒత్తిడికి గురైనప్పుడు ఆత్మహత్య చేసుకుంటాయని పలు అధ్యయనాల్లో వెల్లడైన పరిస్థితి! ఈ క్రమంలో అవి బలమైన గోడలను, రాళ్లను తలతో బలంగా ఢీకొట్టుకుని ఆత్మహత్య ప్రయత్నం చేస్తాయంట. ఇదే క్రమంలో ఒత్తిడి, అనారోగ్యం, ఒంటరితనం వంటి సమస్యలు ఎదురైనప్పుడు ఎలుకలు, పిల్లులు కూడా ఆత్మహత్య చేసుకుని చనిపోతాయంట. ఇలా భూమిపై ఉండే మనుషులు, ఇతర ప్రాణులతో పాటు నీటిలో జీవించే తిమింగలాలు, డాల్ఫిన్లు, చేపలు కూడా ఆత్మహత్య చేసుకుంటాయని అంటున్నారు. ఇందులో భాగంగా.. తీవ్ర ఒత్తిడి కారణంగా.. ఉద్దేశ్యపూర్వకంగా ఒడ్డుకు కొట్టుకురావడం.. లేదా, బలవంతంగా ఊపిరి బిగబట్టుకుని ఉండిపోవడం వంటి చర్యలతో ఈ సముద్ర జీవులు ఆత్మహత్య చేసుకుంటాయని చెబుతున్నారు.

# అధిక చెమటకు అద్భుతమైన చిట్కా





వేసవిలో చెమట అనేది చాలా సాధారణమైన సమస్య. కానీ కొందరికి మాత్రం ఈ చెమట పోయడమే పెద్ద సమస్యగా ఉంటుంది. అందరికన్నా వీరికి మరీ ఎక్కువగా చెమట పోస్తుండటమే ఇందుకు కారణం. ఈ సమస్య నుంచి ఎలా బయటపడాలో తెలియక ప్రస్తుతం చాలా మంది సతమతమవుతున్నారు. డాక్టర్లు కన్సల్ట్ అయినా పెద్దగా లాభం ఉండటం లేదు. చలికాలంలో కూడా చెమట పోసే వీరికి వేసవి అంటే నరకకూపంలా అనిపిస్తుంది. అయితే ఈ సమస్యను నివారించడానికి అనేక సింపుల్ గా ఇంటి చిట్కాలు పాటిస్తే సరిపోతుంది. ఈ ఇంటి చిట్కాలు అధిక చెమటను నిరోధించడానికి బాగా పని చేస్తాయి. ప్రతిరోజూ ఇంట్లో తయారు చేసిన ఒక గ్లాసు తాజా టమాట జ్యూస్ తాగండి. ఇది చెమటను తగ్గిస్తుంది. వీట్‌గ్రాస్ జ్యూస్ కూడా తాగొచ్చు. ఈ జ్యూస్ లో అనేక ఆరోగ్య ప్రయోజనాలు దాగి ఉన్నాయి. ఇది చెమటను తగ్గిస్తుంది. అంతేకాదు వీట్ గ్రాస్ జ్యూస్ లో విటమిన్ బి 6, ప్రోటీన్, విటమిన్ సి, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి 12 బాగా లభిస్తాయి. చెమటను తగ్గించే ఇంకో సులభమైన చిట్కా కార్న్ ఫ్లార్, బేకింగ్ సోడా కాంబినేషన్. 1/2 కప్పు కార్న్‌స్టార్చ్, 1/2 కప్పు బేకింగ్ సోడా, కొన్ని చుక్కల ఎసెన్షియల్ ఆయిల్ తీసుకుని అండర్ అర్మ్స్ కు పట్టించండి. అరగంట తరువాత చల్లటి నీటితో శుభ్రం చేసుకోండి. ఇంకా ఎండాకాలంలో వదులుగా ఉండే సౌకర్యవంతమైన బట్టలు చెమటను నివారించడంలో సహాయపడతాయి. ఎక్కువగా కెఫిన్ తీసుకోవడం వల్ల చెమట ఎక్కువగా పడుతుంది. అందుకే కాఫీ, టీలు కొంచం తక్కువగా తాగండి. ఇంకా ప్రాసెస్ చేసిన ఆహార పదార్థాలు, ఆల్కహాల్, వెల్లుల్లి, ఉల్లిపాయలు, అధిక కొవ్వు కలిగిన ఆహార పదార్థాలు, కారంగా ఉండే వంటకాలు ఎక్కువగా తినడం వల్ల కూడా చెమట ఎక్కువగా పడుతుంది.

# పంచ్‌తో 'వైబ్' గ్యారంటీ



అందం.. అభినయంతో అలరించే సొట్టబుగ్గల సుందరి ప్రీతి జింటా తెరపై కనిపించి చాలా ఏళ్లయ్యింది. ఇన్నేళ్ల తర్వాత 'వైబ్' అనే చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించనున్నట్లు ఇటీవలే ప్రకటించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా విడుదల తేదీని సామాజిక మాధ్యమాల వేదికగా అధికారికంగా పంచుకుంది. "పంచ్.. పంచ్‌లైన్ రెండూ వైబ్‌తో గ్యారంటీ' అనే వ్యాఖ్యల్ని పేర్కొంటూ.. ఈ సినిమా సెప్టెంబరు 18న థియేటర్లలో విడుదల కానుందని తెలిపింది. ఈ మేరకు చిత్రబృందంతో కలిసి ఓ పోస్టర్‌ని ఆవిష్కరించింది. ఈ సినిమాని హిందీ నటుడు కునాల్ కెమ్ము తెరకెక్కిస్తున్నారు. ఇందులో ఆయన, ప్రీతి, స్పర్శ్ శ్రీవాస్తవ, వాన్సిక ధిర్ ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్నారు.

సౌత్ సినీ పరిశ్రమలో ప్రస్తుతం మమితా బైజు పేరు ఒక బ్రాండ్‌గా మారుతోంది. గ్లామర్ పాత్రల కంటే కూడా పర్ఫార్మెన్స్‌కు స్కోప్ ఉన్న క్యారెక్టర్స్ ఎంచుకుంటూ స్టార్ హీరోల సరసన ల్యాండ్ అవుతోంది. రాబోయే రోజుల్లో విడుదల కానున్న ఆమె లైనప్ చూస్తే.. సౌత్ బాక్సాఫీస్ వద్ద ఈమె రేంజ్ మరింత పెరగడం ఖాయంగా కనిపిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆమె తాజాగా ఒక ఇంటర్వ్యూలో తన సినీ ప్రయాణం (Career Journey), తన కెరీర్, ఫ్యాన్స్, ఫ్యూచర్ ప్లాన్స్ గురించి మమితా బైజు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది

'నా అభిమానుల గుండెల్లో ఎప్పటికీ నిలిచిపోయే విభిన్నమైన చిత్రాలను చేయాలన్నదే నా ఏకైక లక్ష్యం. సినిమాల ద్వారా ఒక మంచి ఫ్యాన్ బేస్ సంపాదించుకోవాలని కోరుకుంటున్నాను. నా కెరీర్ ముగిసిన తర్వాత లేదా భవిష్యత్తులో ఎప్పుడైనా నా గతాన్ని, నేను ప్రయాణించిన కాలాన్ని వెనక్కి తిరిగి చూసుకుంటే.. నా ముఖంలో ఒక తెలియని ఆనందం, తృప్తి కలగాలి. అందుకోసమే నేను కథల ఎంపికలో ఇంత జాగ్రత్తగా ఉంటూ నా ప్రయాణాన్ని కొనసాగిస్తున్నాను' అని చెప్పకొచ్చింది.

ఇక రాబోయే కొద్ది నెలల్లో ఆమె నటించిన మూడు క్రేజీ సినిమాలు.. జననాయకన్ (తెలుగులో 'జన నాయకుడు'), విశ్వనాథ్ అండ్ సన్స్, ఇరండు విధానం.. వంటి మమితా బైజు నటించిన బ్యాక్-టు-బ్యాక్ థియేటర్లలోకి రావడానికి సిద్ధంగా ఉన్నాయి. ఈ మూడు సినిమాలు కనుక బాక్సాఫీస్ వద్ద అనుకున్న రేంజ్‌లో క్లిక్ అయితే.. సౌత్ ఇండియాలోనే టాప్ లీగ్ హీరోయిన్ల జాబితాలోకి మమితా చేరడం ఖాయం.

## చేస్తే అలాంటి సినిమాలే చేయాలి..





## ముందు ఆర్థిక స్వేచ్ఛ.. తర్వాతే పెళ్లి

మహిళలు ఎవరిని పెళ్లి చేసుకుంటారనే దానికంటే.. మీరు ఏం చేస్తారు, మీరు ఎవరనేదే ముఖ్యం అంటున్నారు బాలీవుడ్ కథానాయిక కంగనా. వివాహిత మహిళలు ఎదుర్కొంటున్న పరిస్థితులపై ఆమె తాజాగా ఇన్‌స్టా స్టోరీలో ఒక నోట్ పంచుకున్నారు. ఇందులో యువతులు వివాహ బంధంలోకి అడుగుపెట్టే ముందు ఆర్థిక స్వాతంత్ర్యంతో పాటు తమ కెరీర్‌ను నిర్మించుకోవడంపై దృష్టి పెట్టాలని తెలిపారు. "రోజూ పెళ్లి అయిన యువతుల గురించి ఎన్నో విషాద వార్తలు వస్తున్నాయి. చదువుకున్న యువతులలో చాలా మంది ఆ విషాదం ఎదురుకాకముందే.. తమని ఉక్కిరిబిక్కిరి చేసే పరిస్థితుల నుంచి బయటపడేయమని తమ తల్లిదండ్రులను వేడుకుంటున్నారు. కానీ, భారతీయ సమాజం కూతుళ్లకు పెళ్లయ్యాక వారిని వదిలేస్తుంది. మీ జీవితంలో మరెవరోకన్నా మీ కెరీరే మీకు ముఖ్యం. మీరు ఆర్థికంగా స్వేచ్ఛగా ఉన్న తర్వాతే పెళ్లి గురించి ఆలోచించండి. దయచేసి, మీ జీవితానికి మీరే హీరో అయి ఉండండి. మిమ్మల్ని కాపాడటానికి ఎవరూ రారు. మీరు ఎవరిని పెళ్లి చేసుకుంటారనే దానికంటే మీరు ఏం చేస్తున్నారు, ఎవరు అనేదే ముఖ్యం. మీకు కావాల్సిన



జీవితాన్ని మీరే నిర్మించుకోండి. ఎవరి మాటా వినకండి" అని కంగనా ఆ నోట్‌లో పేర్కొన్నారు. ఉత్తరాదిలో ఇటీవల జరిగిన వివాహిత మహిళల ఆత్మహత్యల నేపథ్యంలో కంగనా ఈ పోస్ట్ పెట్టినట్లు సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశమైంది. కంగనా నటిస్తున్న 'భారత భాగ్య విధాత' వచ్చే నెల 12న విడుదల కానుంది.

## ఇలాంటి పనులు చేయడం ఎంత సిగ్గుచేటు..

టుడు ఆర్. మాధవన్ ఇటీవల ఆదిత్య ధర్ దర్శకత్వంలో వచ్చిన 'ధురంధర్: ది రివెంజ్' చిత్రంలో కనిపించారు. ఈ మూవీ భారీ విజయం సాధించడమే కాకుండా భారీ కలెక్షన్లు రాబట్టి పలు రికార్డులు తిరగరాసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం మాధవన్ యష్ రాజ్ ఫిలిమ్స్ వారి 'ఆల్ఫా'తో పాటు, తమిళంలో అదృష్టశాలి, జీడీఎన్, 'సర్కిల్' అనే బైలింగువల్ ప్రాజెక్ట్‌లలో నటిస్తూ ఫుల్ బిజీగా ఉన్నారు. అంతే కాకుండా పలు ఇంటర్వ్యూల్లో పాల్గొంటున్న ఆయన తన వ్యక్తిగత జీవితంపై, అలాగే తన కొడుకు కెరీర్ విషయంలో తీసుకుంటున్న కీలక నిర్ణయాల గురించి చెప్తూ ఎమోషనల్ అవుతున్నాడు. తాజాగా, మాధవన్ ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పెట్టిన ఓ పోస్ట్ సోషల్ మీడియాలో దుమారం రేపుతోంది. ఆయన ఒక హెల్త్ బ్రాండ్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన అనుమతి లేకుండా, పాత ఇంటర్వ్యూ క్లిప్‌లను వాడుకుంటూ తమ బరువు తగ్గే ప్రోగ్రామ్‌లను ప్రమోట్ చేసుకుంటున్న 'ఎలివేట్ నౌ' అనే వెల్నెస్ సంస్థకు ఆయన లీగల్ నోటీసులు పంపినట్లు సమాచారం. ఈ విషయాన్ని మాధవన్ స్వయంగా సోషల్ మీడియా వేదికగా షేర్ చేస్తూ ప్రజలను హెచ్చరించారు. సదరు హెల్త్ బ్రాండ్ మాధవన్ గతంలో మాట్లాడిన ఒక ఫిట్‌నెస్ ఇంటర్వ్యూ వీడియోను, ఫోటోలను వాడుకుంటూ సోషల్ మీడియాలో రీల్స్ రూపంలో యాడ్స్ రన్ చేసిందట.

దీనివల్ల మాధవన్ స్వయంగా ఆ బ్రాండ్‌ను ప్రమోట్ చేస్తున్నట్లు తెలుసుకున్న నెటిజన్లు విమర్శలు చేస్తున్నారు. ఈ విషయంపై మాధవన్



స్పందిస్తూ "ఎంత సిగ్గుచేటు! ఇలాంటి సంస్థలు తాము చేస్తున్న తప్పుల నుండి ఎలా తప్పించుకోగలమని భావిస్తున్నాయి? ఎవరిదో పాత ఇంటర్వ్యూ క్లిప్ తీసుకుని, దాన్ని మీ బ్రాండ్ ఎండార్స్‌మెంట్‌గా ఎలా వాడుకుంటారు?" అని ఫైర్ అయ్యారు. అంతేకాకుండా ఇప్పటికే సదరు సంస్థకు లీగల్ నోటీసులు పంపినట్లు స్పష్టం చేసిన ఆయన, ఇలాంటి సంస్థల పట్ల ప్రజలు, అభిమానులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. నిజానికి మాధవన్ తన ఫిట్‌నెస్ విషయంలో ఎలాంటి కృత్రిమ పద్ధతులు, మందులు వాడరని ఇండస్ట్రీలో మంచి పేరుంది. కేవలం 21 రోజుల్లోనే ఆయన ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ , మితంగా తినడం, క్రమశిక్షణతో కూడిన అలవాట్ల ద్వారా అద్భుతమైన బాడీ ట్రాన్స్‌ఫార్మేషన్ సాధించారు. ఎటువంటి కఠినమైన డైట్లు లేకుండానే కేవలం సహజ పద్ధతుల్లో బరువు తగ్గానని ఆయన గతంలో చెప్పారు. అలాంటి తన వీడియోలను కమర్షియల్ వెయిట్ లాస్ ప్రోగ్రామ్‌ల కోసం వాడుకోవడంపై ఆయన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. ప్రస్తుతం ఈ విషయంపై సోషల్ మీడియాలో సంచలనంగా మారింది.

## ఎన్టీఆర్ ఇంట్లోకి కొత్త అతిథులు.. జపాన్ పేర్లు ఎందుకు పెట్టారో తెలుసా?

ఎన్టీఆర్ లైనప్ ఎంత బిజీగా ఉందో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. అయితే, ఎంత బిజీగా ఉన్నా తన పర్సనల్ లైఫ్‌కు, ఫ్యామిలీకి టైమ్ కేటాయించడంలో తారక్ ఎప్పుడూ ముందే ఉంటారు. తాజాగా ఆయన తన సోషల్ మీడియా వేదికగా షేర్ చేసిన కొన్ని ఫోటోలు ఇప్పుడు నెట్టింట తెగ హల్‌చల్ చేస్తున్నాయి. పుట్టిన రోజున ఎన్టీఆర్ తన ఇంట్లోకి రెండు సరికొత్త రంగురంగుల పెట్స్ (మకావ్ జాతికి చెందిన పక్షులు)ను పరిచయం చేశారు. నెరిసిన గడ్డం, స్లీవ్‌లెస్ టీషర్టుతో సరికొత్త రగ్గడ్ లుక్‌లో ఉన్న తారక్.. నేలపై కూర్చుని ఆ పక్షులతో సరదాగా గడుపుతున్న పిక్స్ అభిమానులను ఫిదా చేస్తున్నాయి. ఒక పక్షి ఆయన చేతిపై వాలగా, మరొకటి కింద ముద్దుగా చూస్తూ కూర్చుంది.

ఈ బర్డ్స్‌ను పరిచయం చేస్తూ తారక్ పెట్టిన క్యాప్షన్ ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. వాటికి ఆయన 'అసాహి', 'యూహి' అని పేర్లు పెట్టారు. జపనీస్ భాషలో 'అసాహి' అంటే ఉదయించే సూర్యుడు (సూర్యోదయం) అని, 'యూహి' అంటే అస్తమించే సూర్యుడు (సూర్యాస్తమయం) అని అర్థం. జపాన్ దేశంపై, అక్కడి సంస్కృతిపై తనకున్న అమితమైన ప్రేమను చాటుకునేందుకే తన ముద్దుల పక్షులకు ఈ జపనీస్ పేర్లను పెట్టినట్లు ఎన్టీఆర్ స్వయంగా వెల్లడించారు. 'ఆర్ఆర్ఆర్' ప్రమోషన్ల సమయం నుండి జపాన్ ఆడియన్స్‌తో తారక్‌కు ఒక ప్రత్యేకమైన అనుబంధం ఏర్పడిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ బాండింగ్‌ను ఇలా తన ఇంట్లోని కొత్త అతిథుల రూపంలో ఆయన గుర్తుచేసుకోవడం విశేషం.




## సోషల్ మీడియాకు రియా చక్రవర్తి బ్రేక్..


బాలీవుడ్ వివాదాస్పద నటి రియా చక్రవర్తి మరోసారి వార్తల్లో నిలిచారు. దివంగత నటుడు, తన మాజీ ప్రియుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మరణం తర్వాత ఎదుర్కొన్న లీగల్ కేసులు, అరెస్టులు, తీవ్రమైన సోషల్ మీడియా ట్రోలింగ్స్ నుండి కోలుకుని.. ఇప్పుడిప్పుడే కెరీర్‌పై ఫోకస్ పెడుతున్న రియా, సడన్‌గా ఒక షాకింగ్ నిర్ణయం తీసుకున్నారు. కొంతకాలం పాటు సోషల్ మీడియాకు పూర్తిగా బ్రేక్ ఇస్తున్నట్లు ఆమె ప్రకటించారు.

'ఈ మధ్య కాలంలో నన్ను నేను కాస్త మిస్ అవుతున్నట్లు అనిపిస్తోంది. సోషల్ మీడియాలోని నిరంతర శబ్దం, స్క్రోలింగ్, ఆన్‌లైన్ ప్రపంచంతో పోటీ పడటం.. ఇవన్నీ నేను ఊహించిన దానికంటే ఎక్కువ భారంగా అనిపిస్తున్నాయి. ప్రతి క్షణాన్ని కెమెరాలో బంధించాలనే ఆలోచన లేకుండా ప్రశాంతంగా గడపాలి. అందుకే కాస్త సోషల్ మీడియా నుండి ఒక అడుగు వెనక్కి వేస్తున్నాను. ప్రస్తుతానికి వర్చువల్ లైఫ్ కంటే నిజ జీవితంలో గడిపే క్షణాలకే నా మొదటి ప్రాధాన్యత. త్వరలోనే మళ్లీ కలుద్దాం' అంటూ తెలిపింది.

కానీ నటిగా మాత్రం ఒక అద్భుతమైన కంబ్యాక్ ఇవ్వనుంది.. ప్రముఖ ఓటీటీ దిగ్గజం నెట్‌ఫ్లిక్స్ (Netflix) ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న సరికొత్త ఒరిజినల్ వెబ్ సిరీస్ 'ఫ్యామిలీ బిజినెస్' (Family Business) లో రియా ఒక పవర్‌ఫుల్ పాత్రలో నటించనున్నారు.ఈ సిరీస్‌లో బాలీవుడ్ సీనియర్ స్టార్ అనిల్ కపూర్, విజయ్ వర్మ, నేహా ధూపియా, ధృవ్ సెహగల్ వంటి హేమాహేమీలు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ ఏడాది చివర్లో స్ట్రీమింగ్‌కు రాబోతుంది.

## బాలయ్య సినిమాలో మంచు మనోజ్.. అధికారికంగా ప్రకటించిన టీమ్

అగ్ర కథానాయకుడు బాలకృష్ణ.. దర్శకుడు గోపీచంద్ మలినేని కలయికలో ఓ సినిమా తెరకెక్కుతోన్న విషయం తెలిసిందే. '#NBK111'గా ఇది ప్రచారంలో ఉంది. తాజాగా ఈ సినిమా టీమ్ అప్‌డేట్‌ను పంచుకుంది. ఈ చిత్రంలో నటుడు మంచు మనోజ్ ఓ కీలక పాత్రలో నటిస్తున్నట్లు ప్రకటించింది. ఈ విషయాన్ని తెలుపుతూ దర్శకుడు పోస్ట్ పెట్టారు. 'మీ పాత్ర ఎంత పవర్‌ఫుల్‌గా ఉంటుందో ప్రేక్షకులు చూడడం కోసం వేచి చూస్తున్నా' అని రాశారు. ఇందులో ఆయన విలన్‌గా నటిస్తున్నట్లు తెలుస్తోంది. గతంతో బాలకృష్ణ , మంచు మనోజ్ ఇద్దరూ 'ఊ..కొడతారా ఉలిక్కిపడతారా' సినిమాలో నటించారు. ఇది రెండో చిత్రం కావడం విశేషం.



హిస్టారికల్ మూవీగా తెరకెక్కుతోన్న '#NBK111'లో బాలకృష్ణ (Balakrishna) ద్విపాత్రాభినయంలో కనిపించనున్నారు. 'వీర సింహారెడ్డి' విజయం తర్వాత గోపిచంద్ మలినేని బాలయ్య నుంచి వస్తున్న రెండో చిత్రమిది. ఇందులో బాలకృష్ణకు జోడీగా నయనతార నటించనున్నట్లు గతంలో వార్తలు వచ్చాయి. తాజాగా నయన్ స్థానంలో కాజల్ తీసుకున్నట్లు టాలీవుడ్ టాక్. దీనిపై చిత్ర బృందం అధికారిక ప్రకటన చేయాల్సి ఉంది. ఇక ఈ చిత్రానికి సంగీతం తమన్ అందిస్తున్నారు. బాలయ్య కోసం తమన్ వర్క్ చేస్తోన్న ఆరో ప్రాజెక్ట్ ఇది. వీరిద్దరి కాంబోలో గతంలో వచ్చిన చిత్రాలన్నీ బాక్సాఫీస్ వద్ద మంచి విజయాలు అందుకున్నాయి. దీంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇప్పుడు మనోజ్ కూడా భాగం కావడంతో అంచనాలు పెరిగాయి.

The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.